
www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 45 పేజిలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com ఆదివారం 31 - 05 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్
ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులకు అవకాశం

## తెలుగువారు ఎక్కడ ఉన్నా
# తెలుగుజాతి ఒక్కటే

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై
- టీడీపీ ఆవిర్భావం తరువాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి
- తెలుగుదేశం ప్రకటించిన మహిళలకు 33 శాతం
- రిజర్వేషన్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది



**అమరావతి :**
చంద్రబాబు ప్రాంతీయ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో మైండ్ గేమ్ ఆడే గొడ్డలి పార్టీ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ, వారి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు తమ తమ నియోజకవర్గాల పరిధిలోని క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్ కుటిల రాజకీయాలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని చంద్రబాబు స్పష్టంచేశారు.ఏపీతో పాటు ఈసారి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహానాడు బాగా జరిగిందని నేతలు, చంద్రబాబుకు వివరించారు. మహానాడు కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలు సరికాదని ముఖ్య మంత్రి పేర్కొన్నారు.ఎంతో చరిత్ర, - మిగతా 2 లో

## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు

- రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్!
- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన



**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో - మిగతా 2 లో

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం



**నెల్లూరు :**
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడు పేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు.ప్లాంట్ ప్రతినిధులతో - మిగతా 2 లో

## కర్ణాటక ముఖ్యమంత్రిగా
# డీకే శివకుమార్



- జూన్ 3న డీకే ప్రమాణస్వీకారం
- స్వయంగా ప్రకటించిన కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్
- మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు
- కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం

**బెంగళూరు :**
కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా - మిగతా 2 లో

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను...
# పట్టపగలే చీకట్లు!



- రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను
- చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం
- అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం
- పశ్చిమ అలజడుల కారణంగానే ఈ తుఫానులు అని వెల్లడి
- ప్రస్తుతానికి ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు

**రాజస్థాన్ :**
రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. - మిగతా 2 లో




## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్
- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన




## ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు
- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన




## నన్ను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు

- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తతల మధ్య బాల్క సుమన్ అరెస్ట్
- పోలీసులను అడ్డుకుని, నినాదాలు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపేనన్న బాల్క సుమన్

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్
- గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య
- కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ

**హైదరాబాద్ :**
తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ - మిగతా 2 లో

## మోటార్లకు మీటర్లు పెడితే
# ఎన్నికల్లో పోటీ చేయం


- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికల నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న
- కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ది కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శ




**హైదరాబాద్ :**
బీఆర్ఎస్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల ముసుగులో రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, ఉచితంగా అందిస్తున్న విద్యుత్ - మిగతా 2 లో


# సంపాదకీయం

## క్వాడ్‌లో మళ్లీ చలనం



ఉందో, ముగిసిపోయిందో తెలియని స్థితిలో ఏడాదిగా దారీతెన్నూ లేకుండా ఉండిపోయిన చతుర్భుజ కూటమి(క్వాడ్)లో ఎందుకనో కొంత చలనం వచ్చింది. మంగళవారం సభ్య దేశాలైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రుల సమావేశం జరగటం, చివరిలో ఒక ఉమ్మడి ప్రకటన వెలువడటం ఆర్నెల్ల ముందు కూడా ఊహకందనిది. ఎందుకంటే నిరుడు జనవరిలో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మిత్రులు, శత్రువులన్న విచక్షణ మరిచి అందరితో గిల్లికజ్జాలకు దిగడం మొదలెట్టారు. నిర్విచక్షణగా సుంకాలు విధిస్తూ అందరినీ సమానంగా ఇబ్బందిపెట్టారు. ఇలాంటి స్థితిలో అమెరికా చొరవతో ఏర్పడ్డ క్వాడ్ ఇక ముగిసిన అధ్యాయమని అందరూ అనుకున్నారు. నిజానికి ఆరంభంనుంచి క్వాడ్ ఏదో కారణంతో అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటూనేవుంది. చైనాకు వ్యతిరేకంగా 2007లో తొలి సమావేశం జరుపుకోగా ఆ మరుసటి ఏడాదికే జపాన్, ఆస్ట్రేలియాలు వైదొలగాయి. ఆ రెండుచోట్లా పాలకులు మారటం ఇందుకొక కారణం. 2008లో అప్పటి మన ప్రధాని మన్మోహన్ సింగ్ 'చైనాను కట్టడిచేసే ఎలాంటి కూటమిలోనూ భాగస్వాములం కాదల్చుకోలేదు' అని కుండబద్దలుకొట్టారు. దాంతో దాదాపు పదేళ్లపాటు అది అచేతనావస్థలో పడింది. 2017 నాటికి దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రం ప్రాంతాల్లో చైనా పెత్తనం పెరగటంతో ట్రంప్ చొరవ తీసుకుని దానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అయినా కోవిడ్ కారణంగా తొలి శిఖరాగ్ర సమావేశం జరగటానికి నాలుగేళ్లు పట్టింది. కీలక ఖనిజాలు, ఇంధన భద్రత, సముద్రజలాల్లో ఇంటర్నెట్ కేబుల్స్ ఏర్పాటు, టెలికాం సాంకేతికత తదితర అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని విదేశాంగ మంత్రుల సదస్సు నిర్ణయించటం తాజా ప్రపంచ పరిణామాల పర్యవసానమే. హార్మూజ్ జలసంధి ప్రతిష్ఠంభన... ఇంధన సరఫరా నిలిచిపోవటం, ఆ ప్రాంతంవైపు నుంచి వచ్చే అండర్ సీ కేబుల్స్ సైతం ప్రమాదంలో పడటం వగైరా అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో నౌకలను అడ్డగిస్తున్న ఇరాన్ వైఖరిని, వచ్చే పోయే నౌకలవద్ద సుంకాలు వసూలు చేసే ఆలోచనను క్వాడ్ సమావేశం తప్పుబట్టింది. అనవసర యుద్ధంతో ఇంత వివాదానికి కారణమై, తాను సైతం హార్మూజ్‌ను దిగ్బంధించిన అమెరికాకు జనాంతికంగానైనా మిగిలిన దేశాలు హితవు పలికాయా అన్నది తెలియదు. చైనాను నిరోధించి, ఇండో–పసిఫిక్ దేశాల భద్రతకు కృషిచేయాలని గతంలో చెప్పుకున్న సంకల్పం ఇప్పుడు తాత్కాలికంగా వెనక్కిపోయింది. ఈ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, ఎప్పటికప్పుడు క్వాడ్ దేశాలమధ్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చు కోవాలని నిర్ణయించినా దీనర్థం క్వాడ్‌ను సైనికీకరణ చేయటం కాదని మన విదేశాంగ శాఖ వివరణనిచ్చింది. క్వాడ్ ఇంధన వేదికను ఈ ఏడాది ఆఖరులోగా నిర్వహించ బోతున్నామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో ప్రకటించారు. కానీ ఈ సంస్థ శిఖరాగ్ర సమావేశాలు ఎప్పుడో చెప్పకపోవటం సందేహాలకు తావిచ్చింది. విదే శాంగ మంత్రుల సమావేశంలోనే శిఖరాగ్ర తేదీలు ప్రకటించటం ఆనవాయితీ. వాస్తవా నికి అది 2024లోనే భారత్‌లో నిర్వహించాలి. కానీ వాయిదా పడింది. ఈలోగా సుంకాల వివాదం నేపథ్యంలో ట్రంప్ మన దేశం రావటానికి చొరవ చూపటం లేదు. క్వాడ్ మొదలయ్యే నాటికి చైనా దూకుడు మీదుంది. ముఖ్యంగా హిందూ సముద్ర ప్రాంత దేశాలమీదుగా అది ప్రారంభించదల్చుకున్న బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టు భారత్ భద్రతకు ముప్పు తెస్తుందన్న సందేహం ఉంది. ఇక ఇరు దేశాల సరిహద్దుల్లో ఆ దేశం తరచు సృష్టించే వివాదాలు సరేసరి. ఇలాంటి నేపథ్యంలో క్వాడ్‌లో భాగస్వామ్యం కావటానికి మన దేశం ముందుకొచ్చింది. ఆనాటి పరిస్థితుల మాటెలావున్నా ఎవరికీ అంతుచిక్కని ట్రంప్ వంటి అధినేతను నమ్మి ముందుకెళ్లటం ఇప్పుడు సాధ్యమేనా? ఆయన చైనాతో సాన్నిహిత్యం కోసం తహతహలాడుతున్నారు. అది ఒక రూపం తీసుకుంటే క్వాడ్ కాడిపడేయరన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే రక్షణేతర రంగాల్లో భాగస్వామ్యం వరకూ ఫర్వాలేకున్నా, ఇతర విషయాల్లో మన దేశం ఆచితూచి అడుగేయక తప్పదు.

## తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే



**మొదటిపేజీ తరువాయి -** నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హితవు పలికారు. 'తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తరువాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడంపై పార్టీ శ్రేణులకు అభినందనలు. మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు. 'పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. ఈ రెండు బిల్లులు కలిపి వస్తేనే నారీమణులకు న్యాయం జరుగుతుంది. ఈ రెండు బిల్లులు దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయి. తెలుగు దేశం ప్రకటించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడూ అన్ని పార్టీలు కూడా స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అతివలకు మొదటి నుంచి టీడీపీ అండగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా దక్షిణాదికి నష్టం. అందుకనే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే న్యాయం జరుగు తుంది. దీనివలన ఎవరికి నష్టం ఉండదని' చంద్రబాబు స్పష్టం చేశారు. త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడ నుంది. ఈ క్రమంలో రేస్‌లో ఉన్న ఆశావాహులు చంద్రబా బును కలిసి తమకు అవకాశం పరిశీలించాలని కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలోనూ, సచివాలయంలోనూ, పార్టీ కేంద్ర కార్యాల యంలో ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చంద్రబాబు, లోకేశ్‌ను కలిసి రాజ్యసభలో తమకు అవకాశం కల్పించాలని కోరుతు న్నారు. ఇలా గత రెండు రోజుల్లో వర్ల రామయ్య, కంభం పాటి రామ్మోహన్ రావు, రెడప్పగారి శ్రీనివాసరెడ్డి, టీడీ జనార్దన్, చింతకా యల విజయ్, తిప్పేస్వామి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్



**మొదటిపేజీ తరువాయి -** సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. అయితే కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం. కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్ చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని చంద్రశేఖర్ కోరారు. కాగా, డీకే శివకుమార్ ఈ రోజు ఉదయం లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే, గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శివకుమార్ సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎందకంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం. కర్ణాటక కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై శనివారం విమర్శల వర్షం కురిపించారు. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో అర్థవంతమైన మార్పు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కర్ణాటక భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సరైన పాలన లేకపోవడం, అభివృద్ధి శూన్యం కావడం వల్ల ప్రజల్లో, ముఖ్యంగా ఓబీసీ సామాజిక వర్గంలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. వారి అసంతృప్తి భవిష్యత్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని జోస్యం చెప్పారు. "ప్రస్తుతం రాష్ట్రం భారీ రుణాల భారంతో కొట్టుమిట్టాడుతోంది. సుపరిపాలన, అభివృద్ధి లేక ప్రజల్లో నైరాశ్యం అలముకుంది. ప్రజలు, ప్రత్యేకించి ఓబీసీ వర్గం నిరంతరం నిరాశకు గురవుతున్నారు. అది ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుంది" అని బొమ్మై హెచ్చరించారు. సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తరుణంలో బొమ్మై ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ ఆమోదించడంతో పాటు మంత్రిమండలిని కూడా రద్దు చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్యను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా ఈ రోజు సాయంత్రం జరగనున్న సీఎల్పీ సమావేశంలో డీకే శివకుమార్‌ను లాంఛనగా ముఖ్యమంత్రిగా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది. ఇది కాస్త సజావుగా సాగితే, ఆ తర్వాత రాజ్యసభ నామినేషన్లు, ఎమ్మెల్సీ పదవులతో సహా కీలక నియామకాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్



**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడిన పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు. ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!



**మొదటిపేజీ తరువాయి -** ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

**మొదటిపేజీ తరువాయి -** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

## మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయం

**మొదటిపేజీ తరువాయి -** వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నామని అన్నారు. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందని వెల్లడించారు.

## ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు



**మొదటిపేజీ తరువాయి -** దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు



**మొదటిపేజీ తరువాయి -** డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## నన్ను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలనుకుంటున్నారు




**మొదటిపేజీ తరువాయి -** తనను జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయిం చారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. అరెస్ట్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కి పైగా కేసులు పెట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే తరహాలో వేధిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగుతోందని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందని ఆరోపించారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెబుతూనే, నేతలను విచారణ పేరుతో వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. తాను ఎక్కడకూ పారిపోలేదని, పార్టీ కార్యక్రమంలోనే ఉన్నానని తెలిపారు. బాల్క సుమన్ అరెస్టు చేసే సమయంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. అరెస్ట్‌ను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పార్టీ కార్యాలయం వద్ద గందరగోళం ఏర్పడింది. బాల్క సుమన్ తెలంగాణ భవన్‌లో ఉన్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయితే, పోలీసులు లోపలికి వస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనం తరం బీఆర్ఎస్ న్యాయవాదులతో చర్చలు జరిపిన పోలీసులు బాల్క సుమన్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.

## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు



ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

# తంటికొండలో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ




**గోకవరం,మే30.అక్షర టైమ్స్:-**గోకవరం మండలం తంటికొండ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తాటేకు పాకలు అగ్రికి ఆహుతి అయినవి.కొత్తగా 3 నెలలు కింద నిర్మించిన ఆకుల సత్తిబాబు టిఫెన్ హోటల్, జొన్నల రాజా కిరాణా షాప్ పూర్తిగా అగ్నికి బూడిదైనవి. శనివారం నాడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తంటికొండలో బాధితులను పరామర్శించారు. నష్టపోయిన వారికి సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. నష్టపోయిన వారికి ప్రభుత్వపరంగా సహాయం అందించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. స్థానిక టిడిపి మండల నాయకులు దాసరి సీతారామకృష్ణ రెండు కుటుంబాలకు వేరువేరుగా రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, గోకవరం మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, క్లస్టర్ కో -ఇన్చార్జ్ బద్దిరెడ్డి బాబి, మలిరెడ్డి సిరి,బద్దిరెడ్డి రవి, గళ్ళ రాము, నాగం వెంకటపతి, జనసేన నాయకులు మిరియాల గాంధీ, టిడిపి మాజీ ఎంపీటీసీ గెద్దం బాబు తదితరులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# శ్రీరంగపట్నం బురద కాలువ సమస్యపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముందస్తు యాక్షన్ ప్లాన్

- రైతులకు పంట నష్టం రాకుండా కాలువ పూడికతీత పనులకు ఆదేశం
- రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- కాలువ సమస్య పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ తో భేటీ
- కోరుకొండ కార్యాలయంలో రైతులతో ఎమ్మెల్యే భేటీ




**కోరుకొండ,మే30.అక్షర టైమ్స్:-** కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పరిధిలోని బురద కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, రైతులకు పంట నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రంగంలోకి దిగారు. కోరుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీరంగపట్నం ప్రాంత రైతులతో ఆయన శనివారం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ప్రాంతంలో బురద కాలువ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను, కాలువ పూడికలు పేరుకుపోవడం వల్ల పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. శ్రీరంగపట్నం బురద కాలువ సమస్య తీవ్రతను గుర్తించామని, వర్షాకాలం మరియు పంటల సీజన్ ప్రారంభం కాకముందే ముందస్తు జాగ్రత్తగా కాలువ మరమ్మత్తుల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ ని కలిసి శ్రీరంగపట్నం గ్రామంలో బురద కాలువ సమస్యను తక్షణమే పరిష్కరించాలని దానికి సంబంధించినటువంటి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన బురద, గుర్రపుడెక్క మరియు పూడికలను తక్షణమే తొలగించడానికి (పూడికతీతలు చేయించడానికి) అవసరమైన యంత్రాలను, సిబ్బందిని రంగంలోకి దించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటలు చేతికి వచ్చే సమయానికి లేదా భారీ వర్షాలు కురిసే సమయానికి కాలువ పొంగి పొర్లకుండా, రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లకుండా ముందస్తుగానే కాలువ గట్లను బలపరచడం, మరమ్మత్తులు చేయడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. సాగునీటి సరఫరాలో కానీ, డ్రైనేజీ వ్యవస్థలో కానీ రైతులకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు త్వరలోనే పూర్తి పరిష్కారం లభిస్తుందని, భవిష్యత్తులో శ్రీరంగపట్నం రైతులకు కాలువ తాలూకు ఏ చిన్న సమస్య రాకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.తమ సమస్యపై తక్షణమే స్పందించి, ముందస్తు చర్యలకు ఆదేశాలు జారీ చేసినందుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో శ్రీరంగపట్నం పరిధిలోని పలువురు రైతు ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నూతన బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం,మే30.అక్షర టైమ్స్:-** గోకవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పర్యవేక్షించారు. రోడ్డు విస్తరణలో వ్యాపార దుకాణాలు పాక్షికంగా నష్టపోవడం వలన దుకాణదారులు ఎమ్మెల్యే కు తమ గోడును మొర పెట్టుకోవడం జరిగింది. నష్టపోతున్న దుకాణదారులను ఆదుకోవాలని రాజమహేంద్రవరం ఆర్డిఓ ఆర్ శివ రాముడు ను కోరిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ వారు గత వైసిపి ప్రభుత్వంలో అప్రూవల్ చేసిన డిపిఆర్ కొనసాగిస్తున్నారని, బ్రిడ్జి మార్పునకు ఢిల్లీ వెళ్లి నేషనల్ హైవే అథారిటీ వారిని కోరడం జరిగిందని అయితే డిపిఆర్ మార్పు జరిగితే టెండర్ రద్దు అవుతుందని, మరల కొత్త డి పి ఆర్ కు ఎక్కువ సమయం పడుతుందని వారు తెలపడం వలన ట్రాఫిక్ తీవ్ర సమస్యగా మారిందని , తప్పని పరిస్థితుల్లో వల్ల బ్రిడ్జి పనులను ప్రారంభించవలసిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై ఇప్పుడు గత వైసిపి నాయకులు రూపొందించిన డిపిఆర్ పై విమర్శలు చేయదలుచుకోలేదని , కేవలం ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసమే ఆలోచిస్తున్నామన్నారు. అదేవిధంగా బ్రిడ్జి విస్తరణలో దగ్గరలో ఉన్న చర్చి కాంపౌండ్ వాల్ నష్టపోవడం వల్ల చర్చి కాంపౌండ్ వాల్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, మండల కన్వీనర్ పిల్ల అర్జున్ సారది (చంటిబాబు)సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మనదొర, మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ ,రాజమండ్రి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు బత్తుల సత్తిబాబు, దాసరి సీతారామకృష్ణ, మండిగ గంగాధర్ , గళ్ళ రాము, ఆచంట రాజు, పోసిన ప్రసాదు, ఎస్ బాబు, గన్నెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జోన్‌లో అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ ఐఏఎస్ సమగ్ర సమీక్ష





**శేర్లింగంపల్లి,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో సాగుతున్న పలు అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ ఐఏఎస్ ఈరోజు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఒక సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లు, వార్డుల్లో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.సమీక్షా సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలు:

రోడ్ల అభివృద్ధి: కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, బీటీ (దీ) రోడ్ల పునరుద్ధరణ పనుల ప్రస్తుత స్థితిగతులపై చర్చించారు.

వరద నివారణ చర్యలు: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్టార్మ్ వాటర్ డ్రైన్ (వర్షపు నీటి కాలువలు) పనుల వేగం, వరద నివారణ చర్యల అమలు తీరును అంచనా వేశారు.

పార్కుల సుందరీకరణ: కొత్త పార్కుల ఏర్పాటు, ఓపెన్ జిమ్ పనులు, ఆట వస్తువుల అమరిక మరియు వాకింగ్ ట్రాక్‌ల పనుల పురోగతిని పరిశీలించారు.పౌర మౌలిక సదుపాయాలు: కమ్యూనిటీ హాళ్లు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, వీధి దీపాల (ఫ్రతీవవి నాఆస్త్రష్ట్రం) ఏర్పాటు వంటి ప్రజా ఉపయోగ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు:**

"అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా, ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా పూర్తి చేయాలి. పనుల వల్ల స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటిస్తూ, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలి."

--- నారాయన్ అమిత్ ఐఏఎస్, జోనల్ కమిషనర్

సమావేశంలో పాల్గొన్నవారు:

ఈ సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (రాజు), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ణఎజుజు), అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు ఇతర ఇంజనీరింగ్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ




**గోకవరం,మే30.అక్షర టైమ్స్:-** విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గోకవరం మండలం తంటికొండ గ్రామంలోని ఉపాధి కూలీలకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, సిబ్బంది శనివారం ఉచితంగా మజ్జిగను పంపిణీ చేసారు. ప్రస్తుత ఎండలు విపరీతంగా మండుతున్న తరుణంలో ఉపాధి కూలీలకు దాహార్తి తీర్చడానికి కంబాల శ్రీనివాసరావు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన అదుబాటులో లేక పోవడంతో ఆయన తరుపున రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మజ్జిగను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా రామసేన సభ్యులు మాట్లాడుతూ కంబాల శ్రీనివాసరావు అమెరికాలో ఉన్నపటికీ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఏ నాయకుడు కూడా చేయని విధంగా మూడు నియోజకవర్గాల్లో సొంత నిధులతో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, సిబ్బంది బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, నెల్లి శ్రీను, శేషగిరి, సూర్య ప్రకాష్, వీరబాబు, సాయి, అభి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- పనులను వేగవంతం చేసిన అధికారులు



**కొండాపూర్,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : శ్రీరాంనగర్ కాలనీ ఏ-బ్లాక్ (A-Block) పరిధిలోని శ్రీరామ హై స్కూల్ నుండి పోలీస్ లైన్ పాత గేట్ వరకు గత కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రంగా ఉండేది.మురికినీరు రోడ్డుపైకి చేరడంతో కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.ఈ సమస్యపై స్థానిక నాయకులు, అధికారులు స్పందించి ఎట్టకేలకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.నేతల సహకారం స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్ ప్రత్యేక సహకారంతో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పోలీస్ క్యాంప్‌లోనూ మరమ్మతులు పోలీస్ క్యాంప్ పరిధిలో పగిలిపోయిన పాత పైపులు, మ్యాన్‌హోళ్లను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు: త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కానుండటంతో, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేశారు.మరికొద్ది రోజుల్లోనే ఈ కొత్త డ్రైనేజీ పనులన్నీ పూర్తిగా పూర్తవుతాయి. కాలనీ వాసుల సహకారంతో పనులను త్వరగా ముగిస్తాం అన్నారు.

# రామప్రభు ఆధ్వర్యంలో ఘనంగా ఐదో శనివారం అన్నదానం కార్యక్రమం




**మియాపూర్,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : సమాజంలో ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం అత్యంత అభినందనీయమని, అన్నార్తులకు అన్నదానం చేయడం మహాదానమని షేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రికా ప్రసాద్ కొనియాడారు.అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ శనివారం అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి,ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ముఖ్య విశేషాలు:**

నిరంతర సేవ: ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలు ఎంతో మంది పేదలకు ఉపయోగపడుతున్నాయని చంద్రికా ప్రసాద్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

**పెద్ద ఎత్తున స్పందన:**

ఐదో శనివారం పురస్కరించుకుని కాలనీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు.సమాజంలో నిరుపేదల ఆకలి తీర్చడమే పరమావధిగా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శప్రాయం.చంద్రికా ప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాల్గొన్న ప్రముఖులు.ఈ సేవా కార్యక్రమంలో పురుషోత్తం, కిరణ్, దయాకర్, తేజ, కరుణాకర్, పాండు, జి. కిరణ్ లతో పాటు శ్రీరాములు కాలనీ సభ్యులు, ఏఆర్పీ (ూ౯ూ) టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు మరియు పలువురు సేవా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, విచ్చేసిన అతిథులకు ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ - శ్యామలా దేవి దంపతుల వివాహ వార్షికోత్సవం



**శేరిలింగంపల్లి,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ూూజ) చైర్మన్ అరెకపూడి గాంధీ, వారి ధర్మపత్ని శ్యామలాదేవి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రముఖులు, పలువురు రాజకీయ నాయకులు వారికి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ రమాదేవి దంపతులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని, ఆదర్శ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని (బొకే) అందజేశారు.శేరిలింగంపల్లి ప్రజల ప్రియతమ నాయకుడు, నిత్య కృషీవలుడు, పేదల పెన్నిధి అయిన అరెకపూడి గాంధీ , శ్యామలాదేవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో, ఎల్లప్పుడూ చిరునవ్వులతో సంతోషంగా జీవించాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అన్నారు.డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ -రమాదేవి దంపతులు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ దంపతులతో పాటు ప్రముఖ నాయకులు, కాలనీ ప్రతినిధులు భాషా, వెంకట్రావు, చక్రపాణి తదితరులు పాల్గొని ఎమ్మెల్యే దంపతులకు తమ హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి వివాహ వార్షికోత్సవ,బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన షేక్ చాంద్ పాషా


**కొండాపూర్,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : పీఏసీ చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి



గాంధీ కి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా ఆయనను కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ సందర్భంగా షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ.. అరికపూడి గాంధీ దాంపత్య జీవితం నిండు నూరేళ్లూ ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, నియోజకవర్గ ప్రజలతో పాటు ఆయనకు పవిత్ర బక్రీద్ పండుగ శుభాకాంక్షలు కూడా అందజేశారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులతో పాటు పలువురు ముఖ్యులు ఉన్నారు.ప్రసాద్ రావు,యూసుఫ్ హుస్సేన్ (యువ నాయకులు),జహీరుద్దీన్,మహమ్మద్ అఫ్సర్, సురేష్, రామకృష్ణ, రాకేష్ తదితరులు,ముక్కోటి దేవతల ఆశీస్సులు, ప్రజల అండదండలతో అరికపూడి గాంధీ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఈ సందర్భంగా కోరుకున్నారు.

# ఖర్గే,రాహుల్‌లతో అనిల్ కుమార్ యాదవ్ భేటీ

- శేరిలింగంపల్లి కాంగ్రెస్‌లో పెరగనున్న జోష్
- ఢిల్లీలో హైకమాండ్ పెద్దలతో వరుస సమావేశాలు..
- నియోజకవర్గ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి



**శేరిలింగంపల్లి,మే30.అక్షర టైమ్స్:-ప్రతినిధి** : శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సమీకరణాలు ఊపందుకున్నాయి.నియోజకవర్గంలో పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి, క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అధిష్ఠానం గట్టి కసరత్తే చేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కార్యకర్తలను ఏకం చేస్తూ సరికొత్త ప్రణాళికలు సిద్ధమవుతున్న వేళ, శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ఢిల్లీ పర్యటన స్థానిక రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**వరుస భేటీలతో ఢిల్లీలో హల్‌చల్**

తన ఢిల్లీ పర్యటనలో భాగంగా అనిల్ కుమార్ యాదవ్ నిన్న తెలంగాణ శాసనసభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాగా, ఈరోజు ఉదయం ఆయన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, క్యాడర్ పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

బాధ్యతను పెంచిన అధిష్ఠానం కలయిక: అనిల్ కుమార్ యాదవ్

"పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గార్లను కలవడం నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. శేరిలింగంపల్లిలో పార్టీ బలోపేతం కోసం శ్రమించాల్సిన బాధ్యతను ఈ భేటీలు మరింత పెంచాయి" అని అనిల్ కుమార్ యాదవ్ తన అధికారిక సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ఖాతా ద్వారా వెల్లడించారు.

**అనిల్ కుమార్‌కు కీలక బాధ్యతలు?**

ఢిల్లీ వేదికగా జరిగిన ఈ వరుస భేటీల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో అనిల్ కుమార్ యాదవ్ ప్రాధాన్యత మరింత పెరగనుందని స్పష్టమవుతోంది. నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపేందుకు గానూ ఆయనకు అధిష్ఠానం త్వరలోనే కీలకమైన బాధ్యతలను అప్పగించే అవకాశం ఉందని ఆయన సన్నిహిత వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. హైకమాండ్ పెద్దల ఆశీస్సులు లభించడంతో శేరిలింగంపల్లి కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది.

## కార్మికుల హక్కుల కోసం అర్ధశతాబ్దానికి పైగా పోరాటం..

- ఘనంగా కార్మిక సంఘం 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కీసర,మే30.అక్షర టైమ్స్:-** కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్మిక సంఘం గత 56 ఏళ్లుగా నిరంతర పోరాటం సాగిస్తోందని కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు అన్నారు.



కార్మిక సంఘం 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జన్నారం కాలనీలో శనివారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.జన్నారం కాలనీలోని సంఘ కార్యాలయం వద్ద బండి కలమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో బంగారు నర్సింగరావు మాట్లాడుతూ కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ కోసం సంఘం నిరంతరం ఉద్యమాలు చేపడుతోందన్నారు. శ్రమజీవుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడంలో సంఘం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొని హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సంఘం స్థాపన నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన నిలబడి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తార, మంజుల, పూజిత, మాధురి, యాదమ్మ, పోచమ్మ, సాయమ్మ, సుశీల, లక్ష్మి, గౌరీ, తులసి, భారతి, మదరబి, సత్తయ్య, శశి, రాజు, మంగుతా నాయక్‌తో పాటు జన్నారం కాలనీ మహిళలు, కార్మికులు, సంఘ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# మల్కాజ్‌గిరి రాజకీయాలపై కాంగ్రెస్ ఫోకస్..

- ఉప్పల్‌లో పార్టీ విస్తరణకు పరమేశ్వర్ రెడ్డి కార్యాచరణ







**మేడ్చల్ మల్కాజ్గిరి,మే30. అక్షర టైమ్స్:-** రానున్న రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా గాంధీభవన్‌లోని ఇందిరా భవన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. బూత్ స్థాయి ప్రతినిధుల నియామకం, డివిజన్ కమిటీల ఏర్పాటు, అనుబంధ సంఘాల బలోపేతం, కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై పార్టీ నాయకత్వం స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. ప్రతి గ్రామం, కాలనీ, బస్తీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించింది.ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ పార్టీ విజయానికి క్షేత్రస్థాయి నిర్మాణమే బలమని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పట్ల విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు.తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాలు, పార్టీ నిర్వహణ వ్యవస్థ, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు.ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యాలను ఉప్పల్‌లో సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పూర్తి చేసి కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సంస్థాగత బలోపేతంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి విస్తరణకు దిశానిర్దేశం చేసిన కీలక వేదికగా నిలిచింది.

## మానవత్వం చాటుకున్న ఎస్ఐ వెంకన్న

- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా మానవత్వంతో ఉన్న ఎస్ఐ వెంకన్న
- జెసిబి సహాయంతో రాగి చెట్టును పక్కకు నెట్టించిన ఎస్ఐ వెంకన్న









**బోనకల్,మే30.అక్షర టైమ్స్:-**బోనకల్ మండలంలో రావినూతల జానకిపురశీ మధ్యలో ఉన్న పెద్ద రాగి చెట్టు నిప్పండిచుట వలన ఇవాళ 11 గంటల సమయంలో చెట్టు పడిపోవడం జరిగింది అక్కడ ఉన్న ప్రజలు పోలీసు వారికి సమాచారం అందించడంతో వెంటనే జెసిపి తీసుకొని వచ్చి ఎస్ఐ వెంకన్న దగ్గర ఉండి చెట్టు పూర్తిగా రోడ్డు సైడ్ కి నటించినారు వెంటనే ట్రాఫిక్ క్లియర్ చేసినారు ఇటీవల పొలాల్లో చెత్త, పొదలు మరియు చెట్ల వేర్లను కాల్చడం వల్ల పెద్ద చెట్లు బలహీనపడి రోడ్లపై పడిపోతున్నాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహనాలపై చెట్లు పడే ప్రమాదం ఉంది, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది.అందువల్ల రైతులు క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి: రహదారుల పక్కన ఉన్న చెట్ల వేర్ల వద్ద లేదా సమీపంలో మంటలు వేయకూడదు.పొలాల్లో చెత్త, పొదలు, ఎండిన కొమ్మలను కాల్చేటప్పుడు పూర్తి భద్రతా చర్యలు తీసుకోవాలి.రోడ్డు పక్కన ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.చెట్లు రహదారిపై పడే అవకాశం ఉన్నట్లయితే ముందస్తుగా తొలగించే చర్యలు చేపట్టాలి.నిర్లక్ష్యంగా మంటలు వేయడం వల్ల ప్రమాదాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ అందరి బాధ్యత. రైతులు సహకరించి ప్రమాదాలను నివారించగలరు.

# పిల్లల ఆరోగ్యమే కుటుంబానికి అసలైన సంపద..

- పోషకాహారంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి
- శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి వెంకటరమణ



**వలిగొండ,మే30.అక్షర టైమ్స్:-** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడి కేంద్రాలకు పంపించడం ద్వారా వారికి పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలు అందుతాయని తెలిపారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు పిల్లలకు సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లల ఎదుగుదల, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే బాల్య దశ నుంచే సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు .కార్యక్రమంలో పర్యవేక్షకురాలు బాలమణి, అంగన్‌వాడి కార్యకర్త కేసరి ప్రేమలత, ఆరోగ్య కార్యకర్త రజిని, ఆయాలు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

# వృద్ధుల సంక్షేమానికి బోనకల్‌లో ప్రత్యేక వేదిక

- సీనియర్ సిటిజన్స్ ల విశ్రాంతి, వినోదం కోసం వృద్ధుల సేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- సమాజానికి జీవితాంతం సేవలందించిన సీనియర్ సిటిజన్స్ ప్రశాంతంగా కాలక్షేపంగా ఉండడానికే వినోద సేవ కేంద్రం
- బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



**బోనకల్,మే30.అక్షర టైమ్స్:-** సమాజానికి జీవితాంతం సేవలందించిన వృద్ధులు ప్రశాంతంగా కాలక్షేపం చేయడంతో పాటు పరస్పరం కలుసుకుని తమ అనుభవాలను పంచుకునేందుకు బోనకల్ మండల కేంద్రంలో ప్రత్యేక వృద్ధుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముమ్మర చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా బోనకల్‌లోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఒక గదిని వృద్ధుల కోసం కేటాయించే అవకాశాలను బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి , ఉప సర్పంచ్ కొండ ,అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ ఒకేచోట సమావేశమై స్నేహపూర్వక వాతావరణంలో సమయం గడపడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం, సామాజిక అంశాలపై చర్చించుకోవడం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు. ఇందుకోసం అనువైన స్థలంగా జలవనరుల శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న గదిని పరిశీలించి, దానిని అధికారికంగా కేటాయించేందుకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో కలిసి చర్చిస్తున్నామన్నారు.అలాగే వృద్ధులు కుటుంబం మరియు సమాజానికి మార్గదర్శకులని, వారికి ప్రత్యేక వేదిక కల్పించడం ద్వారా వారి అనుభవాలు యువతకు ఉపయోగపడటంతో పాటు వృద్ధులలో ఒంటరితనాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగప దుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ గది పరిశీలన కార్యక్రమంలో ఏసీడీపీవో షకీరా బేగం, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు. మరియు బోనకల్ గ్రామ పెద్దలు గుండపనేని సుధాకర్ రావు, తెల్లూరి రమేష్, గూగులోత్ నాగేశ్వర్ రావు, యార్లగడ్డ శ్రీను, గుంగుల పుల్లయ్య, వి. నరసింహారావు, మల్లెల వేలాద్రి, మరీదు శేషు, నారపోగు టైగర్ తదితరులు హాజరయ్యారు.

## ఓటరే పార్టీ బలం.. గ్రామ స్థాయి నుంచే గులాబీ దళం మరింత పటిష్ఠం





**డా"ఏఎస్.రావు నగర్, మే30. అక్షర టైమ్స్:-** డా"ఏఎస్.రావు నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమగ్ర ప్రత్యేక సవరణ--2026పై అవగాహన కల్పించడం, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగ వంతం చేయడం, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష రెడ్డి, రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, కార్యదర్శి పెద్దపురం కుమారస్వామి తదితరులు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, బూత్ స్థాయి వ్యవస్థను పటిష్ఠం చేయడం ద్వారా పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా సవరణపై కార్యకర్తలకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన తెలుగు మహిళలు

- మల్లిపూడి నాగ దీపిక - తుమ్మల సునీత



**కాకినాడ,మే30.అక్షర టైమ్స్:-** మహిళా సాధికారతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని, మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళా రిజర్వేషన్ కు బలమైన పునాది వేసి, మహిళా సాధికారతకు బాటలు వేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని కాకినాడ సిటీ నియోజకవర్గ మహిళ నాయకులు మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత, సుంకర పావని, కొపనాతి నాగ కుమారి పేర్కొన్నారు.పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించటకు మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు తీసుకున్న నిర్ణయంపై శనివారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్ నందు ("ఏనాచీఖ ెాఖ జవీ ూ×=")కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని థాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాకినాడ నగర క్లస్టర్ ఇంచార్జ్ మల్లిపూడి నాగ దీపిక మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన పార్టీగా తెలుగుదేశం పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని, మహిళా రిజర్వేషన్లు, మహిళలకు ప్రాధాన్యత పేపర్లు, ప్రకటనలకే పరిమితం కాకుండా వాస్తవ రూపం దాల్చేలా మహానాడులో తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, మహిళలకు రాజకీయ స్వేచ్ఛ, సముచిత స్థానం కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, మహిళలకు గౌరవం, అవకాశాలు, నాయకత్వం కల్పించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సునీత మాట్లాడుతూ మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం నుండి సామాజికంగా, రాజకీయంగా ప్రోత్సహించడం వరకు ప్రతి దశలోనూ తెలుగుదేశం పార్టీ పాత్ర ప్రతి ఆడబిడ్డ మర్చిపోలేనిది అని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ మహానాడులో తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారని, మహిళలు గృహాలకే పరిమితం కాకుండా ప్రజా సేవలో భాగస్వామ్యులయ్యేందుకు ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ బాటలు వేస్తుందని తెలిపారు.రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది, తొలి మహిళా స్పీకర్ ను నియమించింది, రాష్ట్రానికి డ్వాక్రా సంఘాలను పరిచయం చేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తుందని పేర్కొన్నారు.నగర మహిళ అధ్యక్షురాలు కోపనాతి నాగకుమారి మాట్లాడుతూ 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి, 1.12 కోట్ల మంది మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ అని, మహిళలకే అత్యధికంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తూ, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, తల్లికి వందనం, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలెండర్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లిపూడి నాగ దీపిక, సుంకర పావని, తుమ్మల సునీత, కలగా శివరాణి, గుజ్జు దుర్గ, బంగారు సూర్యావతి, కోపనాతి నాగ కుమారి, వడిసెల దాలమ్మ, నల్లూరు తులసి, పలివెల లక్ష్మి, ముత్యాల రాణి, పొంగా సత్య, చింతలపూడి భవాని, కుసుమ కుమారి, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, మూగు చిన్ని, బుర్ర అప్పలనరసమ్మ, చెక్క సత్యవతి, బుంగా నూకాలమ్మ, కోడూరి నీలిమ, రామలక్ష్మి, రమాదేవి, రవణమ్మ, జగదాంబ, రమాదేవి, కలగా సువర్ణ, వల్లపు మంగ, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా




**కాకినాడ,మే30.అక్షర టైమ్స్:**-తుని మండలం చామవరం గ్రామంలో జూన్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా కలెక్టర్ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్,ఎంపీ సానా సతీష్ బాబుతో కలిసి ముందస్తు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యవేక్షించారు. ఈ పర్యటనలో భాగంగా సభా వేదిక, ముఖ్యమంత్రి అచ్చట సందర్శించబోవు ఇతర ప్రదేశాలు తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు సమీక్షించారు. బారికేడ్ల నిర్మాణం మరియు ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లను నిశితంగా పరిశీలించి, అధికారులకు తగిన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ (ఏ ఆర్) అడిషనల్ ఎస్ పి ఎస్. శ్రీనివాసరావు,ఎస్బిడి ఎస్పి కెవివి.సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పి ఏబిజీ తిలక్,సీఐలు,ఎస్సైలు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేవస్థాన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి




**కావలి/బోగోలు,మే30.అక్షర టైమ్స్:-** నియోజకవర్గంలోని బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి దేవస్థానాన్ని సందర్శించి ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తూర్పు గాలిగోపురం, పడమర గాలిగోపురం, భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న మెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం, భక్తులకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి వసతులు, రహదారి సౌకర్యాలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ఈ ప్రాంతానికి గుర్తింపుగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాలాద్రి, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు

## గొలుసు దొంగతనాల పాల్పడిన సంఘటనతో యువకులు భయభ్రాంతులు


**కాకినాడ,మే30.అక్షర టైమ్స్:-** కాకినాడ వివేకానంద పార్కు సమీపంలో గల ఒక వ్యాయామ కళాశాల జిమ్ ట్రైనర్ గా పనిచేస్తున్న వ్యక్తి చైన్స్ మ్యాచింగ్ ( గొలుసు దొంగతనం)కు పాల్పడుతున్నాడు. శనివారం ఉదయం కాకినాడ చెందిన యువకుడు యధావిధిగా జిమ్ వెళుతుండగా మెట్లపై సగం వరకు చేరుకోగా మాస్క్ టోపీ ధరించి న వ్యక్తి తను వెనకాల వేగంగా రావడం గమనించిన ఆ యువకుడు అతనికి చోటిచ్చేందుకు ప్రక్కకు జరగగా వెంటనే అతను ఆ యువకుడు ని ముందుకు తోసి తన మెడలో ఉన్న బంగారు గొలుసు పెంచేందుకు ప్రయత్నంలో ఆ యువకుడు ఆ దొంగ గట్టిగా పట్టుకుని వదలకుండా పట్టుకోవడంతో మెట్లు పైనుండి క్రింది వరకు ఈడ్చుకుని రావడంతో క్రింద స్థానికులు విషయం గమనించి ఆ ముసుకు దొంగను పట్టుకొని 2వ పట్టణ పోలీస్ స్టేషన్ అప్పగించారు. జిమ్లో అసిస్టెంట్ ట్రైనర్ గా పని చేసే ట్రైనీ ఈ గొలుసు దొంగతనాలకు పాల్పడిన సంఘటనతో ఆ యువకులు భయభ్రాంతులకు గురవుతున్నారు

## నేడు పదవ తరగతి యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**నెల్లూరు,మే30.అక్షర టైమ్స్:**-ఈ సంవత్సరం పదో తరగతిలో 480 మార్కులు పైగా సాధించినప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న యాదవ విద్యార్థినీ విద్యార్థులకు నెల్లూరు కొండాయపాలెం గేటు, గొలగమూడి రోడ్, సాయిబాబ గుడి వద్ద గల యాదవ భవన్ నందు ఈ నెల 31 ఆదివారం నాడు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ మంత్రివర్యులు అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మరియు ఇతర యాదవ ప్రముఖులు అందరూ పాల్గొంటారు . కావున అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు దిగువ ఫోన్ నెంబర్ల కు 6300728589, 9490662651 ఈనెల 30వ తేదీలోగా ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేక మహేష్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బూచి మధుసూదన్ రావు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. కావలి లోని ఒక కళ్యాణ మండపం లో జరిగిన వైఇపిఏ కావలి కార్యవర్గ సమావేశం లో వారు మాట్లాడుతూ కావలి డివిజన్, మరియు కందుకూరు ప్రాంతానికి చెందిన యాదవ విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# యమునా నది పుష్కరాలు - 2026 ప్రాముఖ్యత మరియు విశిష్టత



భారతీయ సంస్కృతిలో నదులకు, ప్రకృతికి అత్యున్నత స్థానం ఉంది. నదులను కేవలం నీటి వనరులుగా కాకుండా జీవనదాతలుగా, తల్లులుగా పూజించే గొప్ప నాగరికత మనది. ఈ నేపథ్యంలో 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కరాల పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉంది. 2026 సంవత్సరంలో పవిత్ర యమునా నది పుష్కరాలు జూన్ 2 నుండి జూన్ 13 వరకు వైభవంగా జరగనున్నాయి. జూన్ రెండవ తేదీ ఉదయం ప్రారంభమయ్యే ఈ పుష్కరాలు జూన్ 13తో ముగుస్తాయి.

పుష్కరాల వెనుక ఉన్న పురాణ గాథ

బృహత్ సంహిత, స్కాంద పురాణాల ప్రకారం... పుష్కరుడు అనే జలాది దేవత బ్రహ్మదేవుని గురించి ఘోర తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమనగా, "నేను ఎల్లప్పుడూ పవిత్రమైన జలముతో నిండి ఉండాలి, నా వల్ల లోకాలకు మేలు జరగాలి" అని పుష్కరుడు కోరాడు.

దానికి బ్రహ్మదేవుడు అనుగ్రహిస్తూ... "నువ్వు బృహస్పతి (గురుడు) తో కలిసి ఉండు. బృహస్పతి ఏ రాశిలో ప్రవేశిస్తే, ఆ రాశికి సంబంధించిన నదిలో మొదటి 12 రోజులు, ఆ తర్వాత సంవత్సరం అంతా అంతర్వాహినిగా నివసిస్తావు" అని వరమిచ్చాడు. అలా బృహస్పతి గ్రహ సంచారాన్ని బట్టి 12 నదులకు పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది బృహస్పతి కర్కాటక రాశిలో ప్రవేశిస్తుండటం వల్ల యమునా నదికి పుష్కరాలు వచ్చాయి.

**యమునా నది జన్మవృత్తాంతం - విశిష్టత**

హైందవ పురాణాల ప్రకారం యమునా నది సూర్యభగవానుని కుమార్తె మరియు యమధర్మరాజు సోదరి. అందుకే ఈమెను 'యమి' లేదా 'సూర్యతనయ' అని కూడా పిలుస్తారు. సూర్యుని భార్య అయిన సంజ్ఞాదేవి ఆయన వేడిని భరించలేక, తన రూపంలో ఉండే 'ఛాయాదేవి'ని సృష్టించి వెళ్ళిపోతుంది. ఆ ఛాయాదేవికి జన్మించిన సంతానమే యమునా దేవి.

కృష్ణుని లీలలు: శ్రీకృష్ణుడు తన బాల్యాన్ని గడిపిన మధుర, బృందావన ప్రాంతాల గుండానే యమున ప్రవహిస్తుంది. కాళీయుడి విషం నుండి యమునా నదిని కృష్ణుడు రక్షించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

పవిత్ర సంగమం: యమునా నది హిమాలయాల్లోని 'యమునోత్రి' వద్ద జన్మించి, ప్రయాగ (అలహాబాద్) వద్ద గంగానదితో కలుస్తుంది. గంగకు ఎడమవైపున పుట్టి, కుడివైపున గంగలో కలిసే ఏకైక నది యమున.

యమునోత్రి విశేషం: యమున పుట్టిన చోట ఆమెను నల్లని నిర్మల విగ్రహ రూపంలో పూజిస్తారు. ఇక్కడే 'సూర్యకుండం' అనే వేడినీటి బుగ్గ ఉంది. ఈ కుండంలోని వేడి నీటిలో రొట్టెలు కూడా కాల్చుకోవచ్చు.

పుష్కర స్నానం ఎందుకు చేయాలి? (శాస్త్రీయ, ఆధ్యాత్మిక కోణాలు)

**1. ఆధ్యాత్మిక ప్రాధాన్యత:**

?యమునా నది తన సోదరుడైన యముడిని ఆదరంగా ఆహ్వానించి భోజనం పెట్టిందని పురాణ కథ. అందువల్ల పుష్కర సమయంలో యమునా నదిలో స్నానం చేయడం వల్ల అకాల మృత్యు భయం తొలగిపోతుందని, యమలోక బాధలు ఉండవని భక్తుల నమ్మకం. ఇది సోదర-సోదరీమణుల అనుబంధానికి ప్రతీక. ఈ సమయంలో పితృదేవతలకు పిండప్రదానాలు చేయడం వల్ల వారికి మోక్షం సిద్ధిస్తుంది.

**2. శాస్త్రీయ ప్రయోజనాలు:**

ఖగోళ శాస్త్రం ప్రకారం, బృహస్పతి గ్రహం నుండి వెలువడే అయస్కాంత తరంగాలు ఈ సమయంలో నదీ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనివల్ల నది నీటికి అద్భుతమైన ఔషధ గుణాలు వస్తాయి. అలాగే, యమునా నది ఉన్నత హిమాలయాల్లోని ఎన్నో రకాల మూలికల గుండా ప్రవహించడం వల్ల, ఈ నీటిలో స్నానం చేస్తే చర్మవ్యాధులు తగ్గి, శరీరానికి నూతన శక్తి లభిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది.

**పుష్కర స్నాన విధానం మరియు నియమాలు**

పుష్కర స్నానం చేసేటప్పుడు కొన్ని పద్ధతులను, నియమాలను తప్పక పాటించాలి:

పద్ధతి: నదికి వెళ్లే ముందే ఇల్లొద్దే స్నానం చేసి వెళ్ళాలి. నదిలోకి దిగే ముందు గట్టు మీద చిటికెడు మట్టిని తీసుకుని, నదిలో వేస్తూ కింది శ్లోకాన్ని పఠించాలి:

పిప్పలాదాత్ సముత్పన్నే కృత్యే లోక భయంకరి!
మృత్తికాంతే మయాదత్తం ఆహారార్థం ప్రకల్పయా!!

ఆ తర్వాత నదిలోకి దిగి, ఆచమనం చేసి, సంకల్పం చెప్పుకుని నదీ ప్రవాహానికి ఎదురుగా నిలిచి స్నానం చేయాలి.

స్నానానంతరం సూర్యునికి, యమునా నదికి, త్రిమూర్తులకు, బృహస్పతికి, పుష్కరిణికి, సప్తఋషులకు మరియు అరుంధతికి అర్ఘ్యం ఇవ్వాలి. ఆపై దక్షిణ దిక్కుగా మునిగి దేవతలకు తర్పణ వదలాలి. గట్టుపైకి వచ్చాక విభూతి, కుంకుమలు ధరించాలి.

ముఖ్య గమనిక: నదిలో స్నానం చేసేటప్పుడు సబ్బులు, షాంపూలు వాడరాదు. నగ్నంగా లేదా అర్ధనగ్నంగా స్నానం చేయకూడదు. నదీ జలాలను కలుషితం చేయడం మహాపాపంగా పరిగణించబడుతుంది.

దానాలు: శక్తి ఉన్నవారు అన్నదానం, దశందానాలు, పితృతర్పణాలు చేయవచ్చు. ఇవేవీ చేయలేని వారు కేవలం నదిలో దిగి తమను చల్లగా చూడమని ప్రార్థిస్తే సరిపోతుంది.

ముఖ్యమైన పుష్కర ఘాట్లు

యమునా పుష్కరాల సమయంలో స్నానాలు, పూజలు చేయడానికి అత్యంత పవిత్రమైన ప్రదేశాలు:

ప్రయాగ్‌రాజ్ (త్రివేణి సంగమం)
మధుర (విశ్రామ్ ఘాట్)
బృందావనం (కేశీ ఘాట్)
ఆగ్రా ఘాటులు
ప్రయాణ సౌకర్యాలు
యమునోత్రికి చేరుకునే మార్గాలు)

విమాన మార్గం: ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా డెహ్రాడూన్‌లోని జాలీగ్రాంట్ విమానాశ్రయం వరకు విమానంలో వెళ్లి, అక్కడి నుండి రోడ్డు మార్గంలో యమునోత్రి చేరుకోవచ్చు.

రైలు మార్గం: డెహ్రాడూన్ లేదా హరిద్వార్ రైల్వే స్టేషన్ల వరకు రైలు సౌకర్యం కలదు. అక్కడి నుండి బస్సులు లేదా ప్రైవేట్ వాహనాల ద్వారా ప్రయాణించవచ్చు.

**ముగింపు**

శ్రీకృష్ణుడు భాగవతంలోని పదవ స్కందంలో "యథా సర్వేశు భూతేషు భగవాన్ వ్యవస్థితః..." అంటూ ప్రకృతిని, సమాజాన్ని, బతుకునిచ్చే భూమిని, కొండలను, నీటిని దైవంగా చూడాలని ప్రబోధించారు. మహాకవి శ్రీనాథుడు కూడా కాశీఖండంలో నదుల గొప్పతనాన్ని కొనియాడారు. కేవలం ఆచారం కోసమే కాకుండా, ప్రకృతి పట్ల మనకున్న భక్తిని, కృతజ్ఞతను చాటడానికి లభించే ఈ అద్భుతమైన యమునా పుష్కరాల అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలి.



రచన : బొల్లు రామమోహన్,రచయిత, పోరుమామిళ్ల,కడప జిల్లా

# విజిలెన్స్ అధికారులపై టిడిపి నేత చవల రామక్రిష్ణ హాల్ చల్

- అధికారుల పిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు
- అధికారుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలు





**కావలి,మే30.అక్షర టైమ్స్:-** కావలిలో రియల్ ఎస్టేట్ వెంచర్లపై విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో భాగంగా స్టాంపు వెండర్స్ నుంచి కొంత సమాచారం సేకరించే క్రమంలో టిడిపి పార్టీకి చెందిన, కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చవాలా రామకృష్ణ అధికారులపై దురుసుగా ప్రవర్తించి ఘర్షణ వాతావరణం నెలకొన్న సంఘటన గురువారం రాత్రి వెలుగు చూసింది. ఈ విషయమై కావలి 1వ పట్టణ సీఐ ఫిరోజ్ ను వివరణ కోరగా హాస్పిటల్ డైరెక్టర్ రామకృష్ణ, కనక కిరీటి రామకృష్ణ లపై విజిలెన్స్ అధికారి సురేష్ బాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. వివరాలు గమనిస్తే పట్టణం లోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట మెడపైన స్టాంపు వెండర్ చెన్నయ్య షాపులో విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో భాగంగా వచ్చి ఆయా సర్వే నంబర్లకు చెందిన డాక్యుమెంట్ లకు చెందిన ఫైల్స్ సేకరించే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో అధికారులకు సహకరిస్తున్న వ్యక్తుల కార్యాలయం వద్దకు కొందరు వ్యక్తులు వచ్చి అధికారుల విధుల్లో ఉండగా జోక్యం చేసుకుని వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. స్టాంప్ వెండర్ కార్యాలయంలో జరుగుతున్న విషయం తెలుసుకున్న చవల రామకృష్ణ, కనక కిరీటి రామకృష్ణ ఇరువురు చేరుకొని అధికారులతో అనుచితంగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. వీరు అధికారులపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విజిలెన్స్ బృందం విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనపై పీవీ సురేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కావలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చవల రామకృష్ణ, కనక కిరీటి రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అధికార పార్టీలో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వ్యక్తులు, అధికారం అండతో విజిలెన్స్ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం సరికాదని స్థానికులు పట్టణంలో చెవులు కోరుకుంటున్న వైనం గుప్పుమనిపిస్తుంది. అధికార పార్టీ అండతో వారు చేపట్టిన ప్రభుత్వ హాస్పిటల్ పదవిలో సైతం ప్రజలకు అండగా ఉండటం మరిచి వ్యవహరించిన తీరును వీడియోల రూపంలో ప్రజలు, పుర ప్రముఖులు చూచి అధికారులపై ఇంతగా వీరి ప్రతాపం చూస్తూ నోటిపై వేలు వేసుకొని చెవులు కొరుక్కుంటున్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజల్లోకి వెళ్లడం తద్వారా పార్టీ ప్రతిష్టతలు, స్థానిక అభివృద్ధికి పాటుపడుతున్న, అధికారులను గౌరవించాలి అని నిత్యం బోధిస్తున్న ఎమ్మెల్యే కి చెడ్డపేరు తెచ్చేవారుగా ఉన్నారని ఆ పార్టీ నేతలే పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా చవల రామకృష్ణ ప్రభుత్వ హాస్పిటల్ ప్రాంగణంలోకి మీడియా మిత్రులను రానివ్వకుండా అడ్డుకొని వివాదానికి తెరలేపిన సందర్భాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూ వీరి వైఖరిపై పలు విమర్శలు చేస్తున్నారు. అసలు ఈ విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్న సమాచారం నకు, అధికార పార్టీ నేతలకు మధ్య గోప్యతకు గల కారణం ఏంటి అని చెవులు కొరుక్కుంటున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. చట్టం ముందు అందరూ సమానమే అనే సందేశం వెళ్లేలా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో అధికారపార్టీ నేతలపై కేసులు బనాయించకుండా ఆపాలని చూసిన వారి ప్రయత్నాలను లెక్కచేయకుండా పోలీస్ అధికారులు కేసు నమోదు చేయడం ఒకింత ఆసక్తికరంగా ఉన్నప్పటికీ మరో కోణంలో చూస్తే ఇది అధికారపార్టీ లోని వర్గ విభేదాల మధ్య రాజుకుంటున్న పరిస్థితిగా చర్చించుకుంటున్నారు.

# వైద్యో నారాయణో హరిః.. నాటి సూక్తి!

- ప్రాణాలు తీసే 'ఇంజక్షన్'..నేటి రీతి!






**కాకినాడ:మే30.అక్షర టైమ్స్:-** కిడ్నీలో రాళ్లు తీయించుకుని ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తాడనుకున్న ఒక పేద కుటుంబ యజమాని ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఒకే ఒక్క 'మృత్యు ఇంజక్షన్'తో శవమైపోయాడు. వైద్యుల, సిబ్బంది ఘోర నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోగా..ఆ కుటుంబం రోడ్డున పడింది.కాకినాడలోని సంజీవిని ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఈ ఘోర కలికలి కలకలం రేపింది.

**అసలేం జరిగింది.?**

కాకినాడ జిల్లా, జగంపేట మండలం, మామిడాడ గ్రామానికి చెందిన దెయ్యల నాని (30) అనే యువకుడు గత కొంతకాలంగా కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నాడు. దీనికి చికిత్స నిమిత్తం సోమవారం నాడు కాకినాడలోని సంజీవిని ఆస్పత్రిలో చేరాడు. కిడ్నీలో రాళ్లు తీసేందుకు చిన్న ఆపరేషన్ చేయాలని వైద్యులు కుటుంబ సభ్యులకు నమ్మబలికారు.అంతా సజావుగానే సాగుతుందనుకున్న తరుణంలో ఉదయం ఆస్పత్రి సిబ్బంది నానికి ఒక ఇంజక్షన్ ఇచ్చారు.ఆ ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే నాని పరిస్థితి విషమించింది. వైద్యుల అత్యవసర చికిత్స విఫలమై, నాని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

**నిరసనలతో అట్టుడికిన సంజీవిని ఆస్పత్రి**

వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నాని చనిపోయాడని మృతుడి బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హాస్పిటల్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. బాధితులకు న్యాయం జరగాలంటూ తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోరాటం ఉధృతమైంది.ఈ పోరాటానికి శెట్టిబలిజ, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి మద్దతు ప్రకటించారు. దీంతో ఆస్పత్రి పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి.

**న్యాయం అడిగితే అరెస్టులా.?**

ఒకవైపు వైద్యం కోసం వెళ్తే ప్రాణాలు తీసే ఆస్పత్రులు.. మరోవైపు ప్రాణాలు కోల్పోయి రోడ్డున పడ్డ అభాగ్య కుటుంబానికి అండగా నిలిచిన నేతలను అణచివేయాలని చూడడం దారుణమని నిరసనకారులు మండిపడ్డారు. బాధితుల పక్షాన నిలిచిన పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, వాసింశెట్టి రాజేశ్వరరావులను పోలీసులు అరెస్టు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

**అధికారుల రంగప్రవేశం - రూ.6.50 లక్షల పరిహారం**

పరిస్థితి చేతులు దాటిపోతుండడం, ప్రజా సంఘాల ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు సంజీవిని ఆసుపత్రి యాజమాన్యం దిగొచ్చింది. స్థానిక ఆర్డీఓ, ఎమ్మార్వో మరియు కాకినాడ పోలీస్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు.నాయకులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు, నక్క కిషోర్ బాబు, రాయుడు మోజేష్ బాబు, సారిపల్లి వెంకటరమణ,పిల్లి శ్రీను,కర్రి శివరామకృష్ణ, కలగా శేషు కుమార్, మునగాల సాయిగోపి ఎంతో చొరవ తీసుకుని బాధితుల పక్షాన నిలబడి చర్చలు జరిపారు.దీర్ఘకాలిక చర్చల అనంతరం, ఆసుపత్రి యాజమాన్యం తన తప్పును పరోక్షంగా అంగీకరిస్తూ దెయ్యల నాని కుటుంబ సభ్యులకు రూ. 6 లక్షల 50 వేల రూపాయల చెక్కును నష్టపరిహారంగా అందజేసింది.

**డబ్బుతో ప్రాణం తిరిగి వస్తుందా.? - అంధకారంలో పిల్లల భవిష్యత్తు.!**

మృతి చెందిన దెయ్యల నానికి ఆరేళ్ల క్రితమే వివాహమైంది. అతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఏకైక ఆధారమైన యజమాని ఇలా హాస్పిటల్ నిర్లక్ష్యం వల్ల కన్నుమూయడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.రూ. 6.50 లక్షల చెక్కు తాత్కాలికంగా ఆర్థిక ఉపశమనం కలిగించవచ్చేమో కానీ, తండ్రి లేని ఆ ఇద్దరు చిన్న పిల్లల భవిష్యత్తుకు భద్రత ఏది? వారి జీవితాల్లో నిండిన అంధకారాన్ని ఏ చెక్కు తుడిచేయగలదు? వైద్యం పేరిట జరుగుతున్న ఇలాంటి నిర్లక్ష్యపు మరణాలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోకపోతే.. రేపు మరో సామాన్యుడు 'సంజీవిని' లాంటి ఆస్పత్రులకు బలికాక తప్పదనే ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో బిసి,శెట్టిబలిజ సంఘాల నేతలు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు,నక్క కిషోర్ బాబు,రాయుడు మోజేష్ బాబు, సారిపల్లి వెంకటరమణ,పిల్లి శ్రీను,కర్రి శివరామకృష్ణ, కలగా శేషు కుమార్, మునగాల సాయిగోపి, గుత్తుల రాజు,నడే వెంకటరమణ, పిల్లి కుమారి, తీరిది ఎల్లమ్మ, ఈశ్వరి, వాసింశెట్టి రాజేశ్వరరావు తోపాటు పలువురు బిసి,ఎస్ సి ,శెట్టిబలిజ సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇవి తింటే స్ట్రోక్ వచ్చే ఛాన్స్ తక్కువట



మీకు 30 ఏళ్లు దాటాయా? అయితే మీరు తినే ఆహారంలో ఈ పదార్థాలు చేర్చుకుంటే మంచిదట! వీటిని మీ డైట్?లో జతచేసుకోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువని నిపుణులు చెబుతున్నారు. మన జీర్ణవ్యవస్థకు మెదడు ఆరోగ్యానికి మధ్య సంబంధం ఉందని 18వ శతాబ్దంలోనే శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే వాటిపైన మరింత అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పరిశీలించారు. ఇందులో శరీరంలోని రెండు ప్రధాన భాగాలైన జీర్ణవాహిక, కేంద్ర నాడీ వ్యవస్థ మధ్య పరస్పర కమ్యూనికేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రోబయాటిక్స్ గుణాలున్న ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండి మెదడును రక్షిస్తుందని వెల్లడించారు.మరోవైపు జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులు, మంచి బ్యాక్టీరియా సంఖ్య పెరగడం వల్ల దీర్ఘకాలంలో స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. 2025లో అనే అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే జీర్ణవ్యవస్థ, మెదడు మధ్య ఉన్న సంబంధంపై చైనాకు చెందిన ఫుడాన్ యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేష్ సర్వేలోని డేటాను సేకరించి పరిశీలించారు. ఇందులో 20ఏళ్లు దాటిన వివిధ ప్రాంతాలు, వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న 48,677 మంది వివరాలు సేకరించారు. వీరికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని పెంచే అవకాడోలు, బ్రకోలీ, కాఫీ, శనగలు, క్రాన్?బెర్రీలు, డెయిరీ పదార్థాలు, సోయా, తృణధాన్యాలు ఆధారంగా ఎక్కువ స్కోర్లు ఇచ్చారు. దీంతో పాటు ప్రాసెస్ చేసిన ఆహారం, మాంసం తీసుకున్నవారికి తక్కువ స్కోర్లు ఇచ్చి విభజించారు. ఇందులో 20-29 ఏళ్ల మధ్య ఉన్నవారిలో ఎలాంటి మార్పులను గమనించలేదని పరిశోధకులు వెల్లడించారు. అదే 30 ఏళ్లు దాటినవారిలో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే.. స్ట్రోక్ వచ్చే అవకాశం తగ్గినట్లు కనిపెట్టారు. ముఖ్యంగా ఆకుకూరలు, వివిధ రకాల పోషకాలు ఉన్న ఆహారం తినేవారిలో స్ట్రోక్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువని తెలిపారు.మరోవైపు జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని 2022లో అధ్యయనంలో తేలింది. జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల సమతుల్యంగా లేకపోవడం వల్ల హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇవన్నీ దీర్ఘకాలంలో స్ట్రోక్?కు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. అధిక రక్తపోటు, అధిక చక్కెర స్థాయిల, జీర్ణక్రియ సమస్యల వల్ల మెదడులో రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

## రోజూ ఇవి వాడితే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ఛాన్స్

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్

కిడ్నీలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివే



మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఆహారం జీర్ణమయ్యే సమయంలో ఏర్పడే మలినాలు, శరీరంలో జరిగే జీవక్రియలో ఏర్పడే వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడూ తొలగించి ఆరోగ్యంగా ఉండేలా కిడ్నీలు సాయంచేస్తాయి. అయితే, ఇటీవల కాలంలో అనేక కారణాల వల్ల చాలా మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి కారణం సరైన ఆహారం తీసుకోకపోవడం, అధిక రక్తపోటు అని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూవారీ జీవితంలో ఉపయోగించే కొన్ని వస్తువుల వల్ల కూడా మన మూత్ర పిండాలు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఫెయిర్ నెస్ క్రీములు: చాలా మంది ఉపయోగించే ఫెయిర్ నెస్ క్రీముల వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని నిపుణులు అంటున్నారు. ఇందులో మెలనిన్ ఉత్పత్తిని అడ్డుకునేందుకు వాడే హానికారక మెర్క్యురీ అధికంగా ఉంటుందని.. దీనిని చర్మం గ్రహించడం వల్ల శరీరంలోకి చేరి కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం పాటు మెర్క్యురీతో కూడిన సౌందర్య ఉత్పత్తులను వాడడం వల్ల కిడ్నీ ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకోసమే ఇలాంటి ఉత్పత్తులు కొనేముందు అందులోని పదార్థాలను చూడాలని.. అవసరమైతే డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు.

**హెర్బల్ సప్లిమెంట్లు :** హెర్బల్ సప్లిమెంట్లను పార్మా మందులకు ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు చాలా మంది. అయితే, వీటిపై నేచురల్, హెర్బల్ అని పెట్టినా సరే.. సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల కొన్ని ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు కలిపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఆర్సనిక్, లెడ్, మెర్క్యురీ వంటి విషపూరిత పదార్థాలను వాడడం వల్ల అవి శరీరంలో పేరుకుపోయి కిడ్నీలను దెబ్బతీస్తాయని తెలిపారు. అందుకే హెర్బల్ ఉత్పత్తులను వాడే ముందు డాక్టర్లను సంప్రదించాలని.. మంచి పేరున్న బ్రాండ్ ఉత్పత్తులను వాడాలని సూచిస్తున్నారు.

**పెయిన్ కిల్లర్స్ :** మనలో చాలా మంది తల, కండరాల నొప్పులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా షాపునకు వెళ్లి పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. అయితే, ఈ మందులు స్వల్పకాలం నొప్పిని తగ్గించినా.. దీర్ఘకాలంలో అనేక ఇబ్బందులను తెస్తాయని నిపుణులు వెల్లడించారు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వీటిని తరచూగా తీసుకోవడం వల్ల కిడ్నీలకు రక్త సరఫరాను తగ్గి ఫలితంగా కిడ్నీలు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**గ్రీన్ టీ :** ప్రపంచంలోనే ఆరోగ్యకరమైన పానీయాల్లో గ్రీన్ టీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటుంటారు. కానీ, గ్రీన్ టీని ఎక్కువగా తాగడం వల్ల (రోజుకు అర లీటర్ కంటే ఎక్కువ) కిడ్నీలు ఫెయిల్ అవుతాయని మీకు తెలుసా? ఇందులో ఉండే ఆక్సలెట్స్.. క్యాల్షియంతో కలిసి కిడ్నీలో రాళ్లు ఏర్పడేలా చేస్తాయని వెల్లడించారు. అలా అని మొత్తంగా గ్రీన్ టీని మానేయాల్సిన అవసరం లేదని.. కానీ ఎక్కువ మోతాదులో తీసుకోకూడదని సూచిస్తున్నారు. మీకు ఇప్పటికే కిడ్నీలో రాళ్లు సమస్య ఉంటే తక్కువ మోతాదులో తాగాలని సలహా ఇస్తున్నారు.

**ప్రొటీన్ సప్లిమెంట్లు :** పోషకాహార లోపం ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారు వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ సప్లిమెంట్లను తీసుకుంటారు. కండరాలు పెరగడానికి చాలా మంది పౌడర్లు, షేక్స్ తీసుకుంటారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. మనం తీసుకునే ప్రొటీన్లను ఫిల్టర్ చేసే బాధ్యత కిడ్నీలపై ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల వాటిని ఫిల్టర్ చేయలేక కిడ్నీపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయని వివరించారు. అందుకే వీటిని మరీ ఎక్కువగా కాకుండా.. తగిన మోతాదులో తీసుకోవాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. హెయిర్ స్ట్రెయిటెనింగ్ ఉత్పత్తులు: కొంతమంది తరచూగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుంకుంటారు. ఇందుకోసం మార్కెట్లో దొరికే కొన్ని ఉత్పత్తులను వాడుతుంటారు. అయితే, ఇందులో ఉండే గ్లైయాక్లాలిక్ యాసిడ్ చర్మం ద్వారా శరీరంలోకి చేరి కిడ్నీలను దెబ్బ తీస్తాయని వెల్లడిస్తున్నారు.



# ప్రతి ఒక్కరు ఓటు హక్కును కాపాడాలి..

### - నియోజకవర్గంలో ఇంచార్జ్ కె.పి.నాగార్జున రెడ్డి



**గిద్దలూరు,మే30.అక్షర టైమ్స్:**-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు నియోజకవర్గంలో ఇంచార్జ్ కె.పి.నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ విభాగ రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా ఎస్ఐఆర్ ప్రక్రియ టాస్క్ ఫోర్స్ సభ్యులు పత్తి రవిచంద్ర పాల్గొని బిఎల్ఏ లకి శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా కేపీ.నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని అన్నారు. ప్రతి బీఎల్ఏ తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఎవరైనా అక్రమంగా ఓటర్లను చేర్చే ప్రయత్నాలు చేస్తే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలని తెలిపారు.రాబోయే నెలన్నర రోజుల పాటు బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఓటు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, ఆ హక్కును కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థి పార్టీలు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి ప్రతి అంశాన్ని పరిశీలించాలని కోరారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయత్ రాజ్ విభాగం కార్యదర్శి, ఎంపీపీ వేగినాటి ఓసూర రెడ్డి, జెడ్పీటీసీ బండ్లమూడి వెంకట రాజయ్య, వైస్ ఎంపీపీ ఖాజామియా, వైసీపీ మండల పార్టీ కన్వీనర్ ఆవుల శ్రీధర్ రెడ్డి, వైసీపీ గిద్దలూరు నియోజకవర్గం స్పోక్ పర్సన్ బొల్లా బాలిరెడ్డి,వైసీపీ బి.పేట టౌన్ కన్వీనర్ మిట్టా చంద్ర శేఖర్ రెడ్డి, పంచాయతీ రాజ్ యూత్ విభాగం అధ్యక్షులు మల్లెల శేఖర్, వైసీపీ జిల్లా నాయకులు కొండా రఘునాథ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు దప్పిలి చిట్టి, సంభూత్ రెడ్డి, వైసీపీ ముఖ్య నాయకులు, బిఎల్ఏ లు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించటం కోసమే ప్రజా దర్బార్

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు,మే30.అక్షర టైమ్స్:**-గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం నియోజకవర్గంలోని గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో కోలాహలంగా మారింది. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను, సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి "ప్రజా దర్బార్"కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచే నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ పరిధిలోని వార్డుల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు అర్జీలు అందచేసి విన్నవించుకున్నారు.ప్రతి ఒక్క అర్జీదారునితో మాట్లాడి సమస్యను శాంతంగా వింటూ, అర్జీలను స్వీకరించారు. గిద్దలూరు పట్టణం 2వ వార్డుకు చెందిన మహిళలు తమ వార్డులోని నరసింహ స్వామి మెట్లు, జీవన్ టైలర్స్ కాలనీల్లో పైప్ లైన్ వేసి త్రాగునీటి సమస్య తీర్చమని విన్నవించారు. 17 వ వార్డులో సగిలేరు సప్లై ఛానల్ వద్ద పడిపోయిన బ్రిడ్జిని పునః నిర్మించాలని, మరియు 60 మీటర్లు సీసీ రోడ్డు వేయాలని స్థానికులు విన్నవించగా వెంటనే గిద్దలూరు కమిషనర్ కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అదే విధంగా పట్టణంలోని అర్బన్ కాలనీలోని సబ్ స్టేషన్ ఫీడర్ పై, హెవీ లోడ్ పడటంతో స్థానికంగా విద్యుత్ సమస్య తరచూ నెలకొంటుందని తెలిపారు. రాచర్ల మండలం, ఆకవీడు గ్రామంలోని ఎస్సి పాలెంలో విద్యుత్ స్థంబాలు అవసరమని ఎమ్మెల్యేకు తెలుపగా సంబంధిత విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. కంభం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించాలని, మరియు రావిపాడు గ్రామంలో పంట కాలువల తూములను మరమ్మత్తులు చేయించాలని విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరతగతిన పరిష్కారం చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రజా దర్బార్ లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, విద్యుత్, తాగునీరు మరియు డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యక్తిగత సమస్యల పై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొత్తం 49 మంది అర్జీదారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం లభించాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. కొన్ని తక్షణ సమస్యల పై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపడం జరిగిందని, మిగిలిన సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు.

# కావలి ఏకైక వైద్యుడిగా డాక్టర్ సుబ్బారెడ్డి కే దక్కింది

- పదవి విరమణ సందర్భంగా పలువురు వ్యక్తులు
- ఘనంగా సన్మానించిన వైద్యులు, సిబ్బంది
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి









**కావలి,మే30.అక్షర టైమ్స్:**-గత 30 సంవత్సరాలుగా కావలి వైద్యరంగంలో విశేష సేవలు అందించి తనకు తానే సాటిగా నిలిచిన డాక్టర్ కె సుబ్బారెడ్డిని పలువురు అభినందించారు. శనివారం కావలి పట్టణంలోని జమున కాంప్లెక్స్ ఎస్ఆర్ పార్కు హాల్లో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అనస్తీయాలజిస్ట్ గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న డాక్టర్ కే సుబ్బారెడ్డి ఉద్యోగ విరమణ సభ కావలి ఏరియా వైద్యశాల ఇంచార్జీ సూపర్నెట్ డాక్టర్ హరిత, ఆర్.యం.ఓ డాక్టర్ ప్రమీల కుమారి ల ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది కలసి ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని డాక్టర్ సుబ్బారెడ్డి నీ అభినందించారు. కర్నూలు జిల్లా వేంపేట గ్రామానికి చెందిన రైతువారీ కుటుంబం వెంకట రంగయ్య, రామసుబ్బమ్మల సుపుత్రుడు డాక్టర్ సుబ్బారెడ్డి. చిన్న వయసులో తల్లిదండ్రులు చనిపోగా, మేనమామ వీరయ్య, నాగలక్ష్మమ్మ దంపతులు పెంపకంలో ఎదిగారు. పదవ తరగతి వరకు కర్నూలు జిల్లాలోని వేల్పనూరు అలాగే ఇంటర్మీడియట్ ఆత్మకూరు, వైద్య విద్య కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. రైతువారీ కుటుంబంలో పుట్టిన సుబ్బారెడ్డి చదువు మీద దృష్టి పెట్టుటకు ఒక బలమైన కారణం గుర్తించాడు. తమ గ్రామానికి వచ్చిన ప్రభుత్వ అధికారులను చూసి అలాంటి స్థాయికి వెళ్ళాలి, ప్రజలకు కొంత సర్వీస్ అందించాలని తన మనసులో చిన్ననాడు పడ్డ బీజం మహావృక్షంగా మారి ఎదిగి వైద్యరంగంలో అడుగు పెట్టాడు. 1992లో నెల్లూరు పట్టణం నకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ తో వివాహం అయింది. అప్పటికే కర్నూలు కు చెందిన డాక్టర్ ఎన్ ప్రభాకర్ నాయుడు కావలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులుగా ఉంటూ కావలిలో మత్తు డాక్టర్ కొరతను గుర్తించి తనను మత్తు డాక్టర్ గా 1993లో కావలికి పిలిపించారని, అనంతరం 1999లో ఇదే కావలిలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మత్తు డాక్టర్ గా విధుల్లో చేరి ప్రజలకు సేవలు అందించి ప్రమోషన్ చానెల్ వచ్చినా విడిచిపెట్టి ఒకే ప్రాంతంలో 27 సంవత్సరాల ఉద్యోగ బాధ్యతలు చేపట్టి నేడు విరమణ పొందుతున్నట్లు తెలిపారు. ప్రముఖ విశ్రాంత వైద్యులు, రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వంటేరు దశరథ రామిరెడ్డి తనకు అన్నివిధాలుగా అండగా ఉన్నారని కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా చేరి వచ్చిన ప్రముఖులు, పెద్దలు, శ్రేయోభిలాషులు విచ్చేసి అభినందించారు. ఈ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తెలియజేస్తూ, పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ పద్మజ దంపతులకు ఇద్దరు కుమారులు డాక్టర్ పృథ్వీ జనరల్ మెడిసిన్ వైద్యులు, డాక్టర్ రామ్ ధనుష్ యురాలాజిస్ట్ వైద్యులు గా ఉండగా, ఆ కుటుంబం లోకి విచ్చేసిన కోడలు డాక్టర్ విష్ణుప్రియ గైనకాలజిస్ట్ గా ఉన్నారు. ఒక రైతు కుటుంబం నేడు చిన్న ఆలోచనతో ఒక మహా వృక్షంగా ఎదిగి ప్రజా వైద్యంలో సేవలు అందించే వారిగా ఉండటం ఎంతైనా అభినందనీయం అని వక్తలు కొనియాడారు.

# బెల్లంముక్కతో ఎన్నో సమస్యలు దూరం

వీటితో కలిపి తింటే సూపర్ బెనిఫిట్స్!

బీపీ, రక్తహీనత, అజీర్తి నెలసరి సమస్యలకు చెక్

విటమిన్లతో పాటు అనేక ఖనిజాలు పుష్కలం!

జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే బెల్లం తినాల్సిందే! మలబద్ధకం సమస్య వేధిస్తోందా? దానికీ బెల్లమే పరిష్కారం! నెలసరి నొప్పులతో బాధపడుతున్నారా? బెల్లం ఉందిగా! ఇలా చెప్పుకుంటూ పోతే బెల్లం తింటే నయం కాని అనారోగ్యమంటూ ఉండదంటే అది అతిశయోక్తి కాదని నిపుణులు చెబుతుంటారు. అయితే ఈ బెల్లాన్ని నేరుగా కంటే కొన్ని పదార్థాలతో కలిపి తీసుకుంటే దాని సుగుణాలు రెట్టింపు అవుతాయంటున్నారు. ఫలితంగా ఆయా ఆరోగ్య సమస్యల్ని తగ్గించడంలో బెల్లం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అజీర్తి దగ్గర నుంచి ఆకలిని అదుపు చేసే దాకా, నెలసరి సమస్యల్ని తగ్గించడం నుంచి చనుబాలు ఉత్పత్తి చేసే దాకా ఇలా ప్రతి ఒక్కటీ బెల్లంతో ముడిపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్లాన్ని ఏయే పదార్థాలతో కలిపి తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయో ఇప్పుడు తెలుసుకుందాం.బెల్లంలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎన్నో ఖనిజాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బి-కాంప్లెక్స్, సి, డి 2, ఇ వంటి విటమిన్లు నిండి ఉన్న బెల్లాన్ని తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయని వెల్లడిస్తున్నారు. దీని వల్ల బీపీని అదుపు చేయడం, శరీరానికి తక్షణ శక్తిని అందించడం, నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం కలిగించడం, రక్తహీనతను తగ్గుతుందని వివరిస్తున్నారు.

### బెల్లం నెయ్యి

ఈ రెండూ కలిపి తీసుకుంటే మలబద్ధకం సమస్య నుంచి విముక్తి పొందచ్చు. బెల్లంధని యాలు: ఇలా తీసుకుంటే నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నొప్పుల నుంచి విముక్తి పొందచ్చు. ఇంకా స్పాటింగ్ మాత్రమే అవుతోందని బాధపడే వారికి ఆ సమస్య తగ్గి ఎప్పటిలాగే పిరియడ్స్ ప్రారంభమవుతాయట.

### బెల్లం సోంపు

ఇది నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. అంతేకాకుండా దంతాలపై పాచి పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

### బెల్లం మెంతులు

ఇలా రెండు కలిపి తీసుకుంటే జుట్టు ఆరోగ్యం రెట్టింపు అవుతుంది. కుదుళ్లు దృఢంగా మారడమే కాకుండా.. తెల్ల జుట్టు రాకుండా జాగ్రత్తపడచ్చు.

### బెల్లం గోంద్

ఎముకల్ని దృఢంగా చేయడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ చక్కగా ఉపకరిస్తుందని నిపుణులు అంటున్నార. అలాగే పాలిచ్చే తల్లులు తీసుకుంటే చనుబాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.

### బెల్లం అలీవ్ గింజలు

మనం తీసుకునే ఆహారంలోని ఫోలికామ్లం, ఐరన్‌ను శరీరం త్వరగా గ్రహించేందుకు ఈ ఫుడ్ కాంబినేషన్ తోడ్పడుతుందని తెలిపారు. ఇక చర్మంపై ఏర్పడిన పిగ్మెంటేషన్‌ని తగ్గించడంతో పాటు జుట్టు పెరుగుదలకూ దోహదం చేస్తుందని వివరించారు.

### బెల్లం నువ్వులు

ఈ రెండింటిని కలిపి తినడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి దరిచేరకుండా కాపాడుతుంది.



### బెల్లంంపల్లీలు

శరీరంలో సత్తువను పెంచడానికి, ఆకలిని అదుపు చేయడానికి, ఆహారపు కోరికల్ని తగ్గించడానికి ఈ ఫుడ్ కాంబినేషన్ అద్భుతంగా పని చేస్తుందని నిపుణులు అంటున్నారు.

బెల్లంంపసుపు: ఈ రెండూ కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు.

బెల్లంంశొంఠి పొడి: వీటిని కలిపి తినడం వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోవచ్చు. ఇంకా శరీరంలోని వాపును తగ్గించడానికి ఇది దోహదం చేస్తుంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్

### ఈ ఒక్క ఏరియాలోనే ఇల్లు కావాలంటున్న కొనుగోలుదారులు



భాగ్యనగరంలో స్థిరాస్తి రంగం ఎప్పుడూ ఒక కొత్త మలుపు తీసుకుంటూనే ఉంటుంది. ఒకప్పుడు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ఐటీ కంపెనీల రాకతో ఎలాగైతే ఊహించని రీతిలో అభివృద్ధి చెందాయో.. ఇప్పుడు సరిగ్గా అదే తరహా వృద్ధి ఉత్తర హైదరాబాద్' వైపు కనిపిస్తోంది. రియల్టీ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. రాబోయే కొద్ది ఏళ్లలోనే ఈ ప్రాంతం గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ స్థాయికి చేరుకోనుంది.గతంలో ఐటీ రంగం కేవలం పశ్చిమ హైదరాబాద్‌కే పరిమితమై ఉండేది. అయితే, నగరం నలువైపులా ఐటీని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కండ్లకోయలో భారీ ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ పార్క్.. విస్తీర్ణంలో ప్రఖ్యాత సైబర్ టవర్స్ కంటే పెద్దదిగా ఉండబోతోంది. భవిష్యత్తులో ఇక్కడ దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టు ప్రకటనతోనే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పుంజుకుంది.ఉత్తర హైదరాబాద్ అభివృద్ధికి రవాణా సౌకర్యాలు వెన్నెముకగా నిలుస్తున్నాయి:రహదారులు: హైదరాబాద్–నాగ్‌పూర్ జాతీయ రహదారి ఈ ప్రాంతం గుండా వెళుతుంది. రద్దీని తగ్గించేందుకు సుచిత్ర నుండి కొంపల్లి వరకు సుమారు 10 కి.మీ మేర మూడు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే & ఎంఎంటీఎస్: ముంబై, షిర్డీ వెళ్లే ప్రధాన రైలు మార్గంతో పాటు బొల్లారం, మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ సదుపాయం ఉండటం ఉద్యోగులకు వరం.ప్రాముఖ్యత: ఇక్కడ జీనోమ్ వ్యాలీ, నల్సార్ వంటి అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు ఇప్పటికే కొలువుదీరాయి. ఇతర హైవేలతో పోలిస్తే ఇక్కడ ట్రాఫిక్ తక్కువగా ఉండటం వల్ల 30 నిమిషాల్లోనే నగరం నడిబొడ్డుకు చేరుకోవచ్చు.హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా.. హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా..అందుబాటులో ధరలు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ప్రస్తుతం ఖరీదైన పెట్టుబడి మార్కెట్లుగా మారాయి. సామాన్యులకు అక్కడ స్థలాలు కొనడం కష్టతరంగా మారింది. దీనికి భిన్నంగా ఉత్తర హైదరాబాద్‌లోని కొంపల్లి, మేడ్చల్ వైపు ధరలు అందుబాటులో ఉన్నాయి.అపార్ట్‌మెంట్లు: చదరపు అడుగుకు రూ.4,500 – రూ.5,000.గేటెడ్ కమ్యూనిటీ: చ.అ.కు రూ.5,500 – రూ.6,000.ఓపెన్ ప్లాట్లు: గజం ధర రూ.60,000 నుండి రూ.80,000 వరకు పలుకుతోంది.హాట్‌స్పాట్‌గా మారుతున్న ప్రాంతాలుప్రస్తుతం జీడిమెట్ల, దూలపల్లి, అల్వాల్, బొల్లారం, కొంపల్లి, కండ్లకోయ, శామీర్‌పేట మరియు మేడ్చల్ వంటి ప్రాంతాలు పెట్టుబడులకు కేంద్ర బిందువులుగా మారాయి. నిజామాబాద్, కామారెడ్డి వంటి ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారు కూడా ఇక్కడ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాంతంలో భారీ విల్లా ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాలను నిర్మించడానికి భూములను సేకరిస్తున్నాయి.ఏదేమైనా అభివృద్ధిని ముందుగానే ఊహించి పెట్టుబడి పెట్టే వారికి ఉత్తర హైదరాబాద్ ఒక బంగారు అవకాశంలా కనిపిస్తోంది. పశ్చిమ హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన ఇళ్లు లభించే అవకాశం ఉండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# బెంగళూరు రియల్ ఎస్టేట్ దూకుడు!




### మెట్రో పుణ్యమా అని ఆ ఏరియాల్లో 40% పెరగనున్న ధరలు!

బెంగళూరు అంటే ముందుగా ట్రాఫిక్ గుర్తొస్తుంది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది! బెంగళూరు అంటే మెట్రో సర్వీస్ కు కేరాఫ్ అనేగా సిటీ డెవలప్ అవుతుంది. మన సిలికాన్ వ్యాలీలో మెట్రో నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తుండటంతో, రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా హీటెక్కింది. ముఖ్యంగా కొత్తగా వస్తున్న యెల్లో లైన్, పింక్ లైన్ మెట్రోల వల్ల కొన్ని ఏరియాల్లో ఇళ్ల ధరలు ఆకాశాన్ని తాకబోతున్నాయని ప్రముఖ సంస్థ 'కొలియర్స్ ఇండియా' తాజా నివేదిక వెల్లడించింది. వచ్చే రెండేళ్లలో ప్రాపర్టీ రేట్లు ఏకంగా 20% నుండి 40% వరకు పెరిగే అవకాశం ఉందట! ఏ ఏరియాల్లో డిమాండ్ పెరుగుతోంది? ముఖ్యంగా సౌత్ బెంగళూరులో మెట్రో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2025లో అందుబాటులోకి వచ్చిన యెల్లో లైన్ (ఆర్వీ రోడ్ – బొమ్మసంద్ర) ఎలక్ట్రానిక్ సిటీ వంటి ఐటీ హబ్‌లకు కనెక్టివిటీని పెంచింది. దీనివల్ల ఆ ప్రాంతాల్లో రేట్లు ఇప్పటికే భారీగా పెరిగాయి. ఇక ఇప్పుడు అందరి కళ్లు పింక్ లైన్ (కాలేన అగ్రహార – నాగవార) మీద ఉన్నాయి. ధరల పెరుగుదల అంచనాలు ఇలా ఉన్నాయి.. బన్నేరఘట్ట రోడ్డు: ఇక్కడ పింక్ లైన్ ప్రభావం వల్ల వచ్చే రెండేళ్లలో ధరలు 30% నుండి 40% వరకు పెరగొచ్చని అంచనా. జేపీ నగర్: ఇక్కడ కూడా మెట్రో రాకతో 20% నుండి 30% వరకు ప్రాపర్టీ విలువ పెరగనుంది. ఎలక్ట్రానిక్ సిటీ: ఇప్పటికే 45% పెరుగుదల చూసి న ఈ ఏరియాలో, మరో 20-30 % పెరిగే ఛాన్స్ ఉంది. బీటీఎమ్ లేఅవుట్ & జయనగర్: ఈ ప్రాంతాల్లో కూడా 10% నుండి 20% వరకు పెరుగుదల కనిపి స్తుంది. ఎందుకు ఈ పెరుగుదల? సాధారణంగా ఎక్కడైనా రవాణా సౌకర్యం పెరిగితే అక్కడ డిమాండ్ పెరుగుతుంది. పింక్ లైన్ అందు బాటులోకి వస్తే బన్నేరఘట్ట రోడ్డు, జేపీ నగర్, శివాజీ నగర్ వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణం చాలా ఈజీ అయిపోతుంది. ప్రయాణ సమయం తగ్గడం వల్ల ఐటీ ఉద్యోగులు, మిడిల్ క్లాస్ ఫ్యామిలీలు ఈ ఏరియాల్లో ఇళ్లు కొనడానికి లేదా అద్దెకు ఉండటానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీనివల్ల లగ్జరీ అపార్ట్‌మెంట్లతో పాటు మిడి ల్-ఇన్కమ్ ఇళ్లకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. డెవలపర్ల ప్లాన్ ఏంటి ఈ డిమాండ్‌ను గమనించిన పెద్ద పెద్ద బిల్డర్లు పింక్ లైన్ పరిసర ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులను వేగంగా లాంచ్ చేస్తున్నారు. ఆఫీస్ స్పేస్‌లు, రిటైల్ షాపులు, హోటళ్లు కూడా ఇక్కడ భారీగా రాబోతున్నాయి. మొత్తానికి, బెంగళూరు లో ఇల్లు కొనాలనే ఆలోచన ఉంటే మాత్రం ఆలస్యం చేయకపోవడమే మంచిదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ఎందుకంటే మెట్రో రైలు పట్టాలెక్కే కొద్దీ, ఇళ్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు వెళ్లేలా ఉన్నాయి!

# ఆఫీస్‌కు వెళ్లక్కర్లేదు బాస్ టెన్షన్ లేదు!

### జీతం మాత్రం 9 కోట్లు! ఇదెలా సాధ్యం



సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వార్త (ట్రెండింగ్ ) లో ఉంది. సాధారణంగా సాఫ్ట్‌వేర్ రంగంలో లేదా పెద్ద కంపెనీల్లో 15-20 ఏళ్ల అనుభవం ఉన్నవారికి కోట్లలో జీతం ఉండటం చూస్తుంటాం. కానీ, కేవలం 3 ఏళ్ల ఎక్స్‌పీరియన్స్‌తో ఏకంగా రూ. 9 కోట్ల వార్షిక ప్యాకేజీని అందుకుంటున్నానని ఒక యువతి చేసిన పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. సతాక్షి అనే యువతి తన రిమోట్ వర్క్ శాలరీ వివరాలను వెల్లడించడంతో నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. గూగుల్ మేనేజర్‌తో సమానంగా.. సతాక్షి తన పోస్ట్‌లో పేర్కొన్న దాని ప్రకారం.. ఆమె అందుకుంటున్న ప్యాకేజీ గూగుల్ ఇండియాలోని ఒక సీనియర్ మేనేజర్ శాలరీతో సమానం. "ఇదే రిమోట్ ఎంప్లాయ్‌మెంట్ అందం" అంటూ ఆమె చెప్పుకొచ్చింది. మొదట్లో చాలా మంది ఇది నిజం కాదని కొట్టిపారేసినప్పటికీ, ఆమె తన ఆఫర్ లెటర్ స్క్రీన్ షాట్‌లను షేర్ చేయడంతో అందరి నోళ్లు మూతపడ్డాయి. తన విజన్, ఆలోచనా విధానం కంపెనీ లక్ష్యాలకు అనుగుణంగా ఉండటం వల్లే ఈ భారీ ప్యాకేజీ లభించిందని ఆమె తెలిపింది. కేవలం కంపెనీలే లక్ష్యం వద్దు! చాలా మంది యువత మెటా, అమెజాన్, ఆపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ వంటి దిగ్గజ కంపెనీల వెంటే పడుతుంటారు. కానీ సతాక్షి మరోలా ఆలోచించమని చెబుతోంది. అక్కడ పోటీ విపరీతంగా ఉంటుందని, కేవలం ఆ రొటీన్ పద్ధతిలో వెళ్లకుండా గ్లోబల్ రిమోట్ మార్కెట్‌ను ఎక్స్ ప్లోర్ చేయాలని సూచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా టాలెంట్ ఉన్నవారి కోసం భారీగా చెల్లించే కంపెనీలు చాలా ఉన్నాయని ఆమె అభిప్రాయపడింది. కోట్లలో జీతం రావాలంటే ఏం చేయాలి డాలర్లు లేదా యూరోలలో జీతం ఇచ్చే రిమోట్ జాబ్స్ సాధించడం అంత సులభం కాదని ఆమె హెచ్చరించింది. నైపుణ్యం ఏదైనా ఒక రంగంలో పూర్తి పట్టు సాధించాలి. నెట్‌వర్కింగ్: గ్లోబల్ కంపెనీలతో నిరంతరం టచ్‌లో ఉండాలి. నిలకడ: ఫుల్ టైమ్ జాబ్ చేస్తూనే గ్లోబల్ అవకాశాల కోసం వెతకడం మానేయకూడదు. అందరూ చేసే పని చేస్తే అందరికీ వచ్చే జీతమే వస్తుందని, ప్రత్యేకంగా ఎదగాలంటే గ్లోబల్ మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా స్కిల్స్ పెంచుకోవాలని ఆమె స్పష్టం చేసింది. రిమోట్ వర్క్ ఎందుకు బెస్ట్? ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, ఏఐ , డిజైనింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉన్నవారికి దేశ సరిహద్దులతో సంబంధం లేకుండా అవకాశాలు వస్తున్నాయి. ఇండియాలో ఉంటూనే అమెరికా లేదా యూరప్ కంపెనీలకు పని చేయడం వల్ల తక్కువ ఖర్చుతో కూడిన జీవనం సాగిస్తూనే, విదేశీ కరెన్సీలో భారీగా సంపాదించే వీలుంటుంది. ఈ ట్రెండింగ్ పోస్ట్ ద్వారా మనకు అర్థమయ్యే విషయం ఒక్కటే.. సక్సెస్‌కు ఇప్పుడు పాత పద్ధతులే కాదు, కొత్త మార్గాలు కూడా చాలా ఉన్నాయి! మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, ఇలాంటి భారీ ప్యాకేజీలు అందరికీ ఒకేసారి రాకపోవచ్చు, కానీ ప్రయత్నం మాత్రం ఆపకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు డిగ్రీల కంటే కేవలం ప్రతిభకే పట్టం కడుతున్నాయి. మీరు ఏ ఊరిలో ఉన్నా, మీ దగ్గర గ్లోబల్ మార్కెట్‌కు కావాల్సిన నైపుణ్యం ఉంటే ఆకాశమే హద్దుగా సంపాదించవచ్చు. అందుకే రొటీన్ బాటలో కాకుండా, కొత్త టెక్నాలజీలను నేర్చుకుంటూ అంతర్జాతీయ వేదికలపై మీకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది!

# ఉద్యోగం వదిలేసి స్టార్టప్ మొదలుపెట్టాడు




4 నెలల్లోనే రూ. 1 కోటి కొల్లగొట్టాడు! కేవలం 24 ఏళ్ల వయసులోనే ఓ భారతీయ యువ స్టార్టప్ ఫౌండర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తన స్టార్టప్ కేవలం నాలుగు నెలల్లోనే రూ. 1 కోటి ఆదాయాన్ని ఆర్జించిందని ఆయన చేసిన ప్రకటన నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వార్త ఇప్పుడు ఉద్యోగుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. చాలామంది యువ ప్రొఫెషనల్స్ తమ రెగ్యులర్ ఉద్యోగాలను వదిలేసి, స్టార్టప్ రంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కలలు కంటున్నారు. అన్ష్ చౌదరి తన కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆన్‌లైన్ క్రియేటర్ల కోసం 'హఅఅస్రాశ్రీముంవ' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు. భారతదేశంలో ప్రస్తుతం పెరుగుతున్న 'సైడ్ హజిల్' సంస్కృతికి ఇదొక నిదర్శనం. ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ లింక్స్‌ను సులభంగా మేనేజ్ చేసుకోవడానికి, తద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుంది. డిజిటల్ టూల్స్ స్థానిక ఆర్థిక వ్యవస్థను ఏ స్థాయిలో మారుస్తున్నాయో ఈ స్టార్టప్ వృద్ధిని చూస్తే అర్థమవుతుంది. రూ. 1 కోటి క్లెయిమ్ – ఇండియాలో క్రియేటర్ టూల్స్ ట్రెండ్ రూ. 1 కోటి అనగానే అది మొత్తం లాభం అని అనుకుంటే పొరపాటే. ఇది ప్లాట్‌ఫామ్ ద్వారా జరిగిన మొత్తం సేల్స్ ను సూచిస్తుంది. అంటే, వివిధ క్రియేటర్లు ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగించి జరిపిన లావాదేవీల మొత్తం ఇది. స్టార్టప్‌కు వచ్చే అసలు ఆదాయం కేవలం ట్రాన్సాక్షన్ ఫీజులు, మంత్లీ సబ్‌స్క్రిప్షన్ల ద్వారా మాత్రమే వస్తుంది. కొత్తగా బిజినెస్ మొదలుపెట్టే ప్రతి భారతీయ యువ పారిశ్రామికవేత్త ఈ లెక్కలను స్పష్టంగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ రంగంలో భారత్ గ్లోబల్ హబ్‌గా మారుతోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో క్రియేటర్ టూల్స్‌కు ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఉంది. డిజిటల్ ప్రొడక్ట్స్ అమ్మడానికి లేదా పెయిడ్ కన్సల్టేషన్ల కోసం వారు ఈ యాప్స్‌ను వాడుతున్నారు. సాధారణంగా ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లు ప్రతి సేల్‌పై 5 నుంచి 10 శాతం వరకు ఫీజును వసూలు చేస్తాయి. వివరాలు వివరణ స్టార్టప్ పేరు రిపోర్ట్ చేసిన సేల్స్ 1 కోటి ఆదాయ రకం ప్లాట్‌ఫామ్ ఇలాంటి బిజినెస్ ప్రారంభించాలంటే పక్కా ప్లానింగ్, చట్టపరమైన ట్యాక్స్ నిబంధనల అవగాహన ఉండాలి. టర్నోవర్ నిర్దేశిత పరిమితి దాటినప్పుడు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అలాగే, ఫుల్ టైమ్ ఉద్యోగానికి రాజీనామా చేసే ముందే, మీ ఐడియాలను సైడ్ ప్రాజెక్ట్‌లుగా టెస్ట్ చేయడం ఉత్తమం. దీనివల్ల రిస్క్ తగ్గుతుంది. ఫౌండర్ సక్సెస్ స్టోరీ ఇంటర్నెట్ పవర్‌ను మరోసారి నిరూపించింది. ఇది ఎంతోమందికి సొంతంగా బిజినెస్ ప్రారంభించాలనే స్ఫూర్తినిస్తోంది. అయితే, కేవలం ఒక్క వైరల్ మూమెంట్‌తోనే విజయం రాదు, దీర్ఘకాలం రాణించాలంటే నిరంతర కష్టపడే తత్వం చాలా అవసరం.

# ముందు ఆ నిషేధం ఎత్తివేయండి తర్వాత చర్చలు గురించి మాట్లాడదాం



ట్రంప్‌కు ఇరాన్ దిమ్మతిరిగే షరతు అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరో కీలక మలుపు తిరిగాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని నివారించేందుకు పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలకు హాజరయ్యే విషయంలో టెహ్రాన్ అత్యంత కఠినమైన షరతును విధించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా సైన్యం విధిస్తున్న నావికా దళ దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేస్తేనే తాము చర్చల బల్ల ముందుకు వస్తామని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ స్పష్టం చేశారు. అమెరికా ఒకవైపు కాల్పుల విరమణను పొడిగిస్తూనే.. మరోవైపు ఓడరేవులను దిగ్బంధించడం 'యుద్ధ విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే'నని ఆయన అభివర్ణించారు. శాంతిని కోరితే తాము సిద్ధమని, ఒకవేళ యుద్ధమే కావాలనుకుంటే దానికి కూడా ఇరాన్ వెనకాడదని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ నాయకత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఇరాన్ ఉన్నతాధికారుల నుండి మాత్రం వ్యతిరేక సంకేతాలే అందుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సలహాదారు మహ్దీ మొహమ్మదీ అమెరికా వైఖరిని ఎద్దేవా చేస్తూ, "ఓడిపోతున్న పక్షం షరతులు విధించదు" అని వ్యాఖ్యానించారు.కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ కీలక ప్రకటన..హార్ముజ్ జలసంధిని వదిలేది లేదంటూ ఇరాన్‌కు మరో వార్నింగ్.. మరోవైపు ఇస్లామాబాద్‌లో జరగాల్సిన ఈ చర్చలపై అనిశ్చితి నీడలు కమ్ముకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వారి ప్రతినిధి బృందం పాకిస్థాన్ పర్యటనను వైట్ హౌస్ ప్రస్తుతానికి నిలిపివేసింది. అయినప్పటికీ, పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం శాంతి చర్చల కోసం అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇస్లామాబాద్ మరియు రావల్పిండి పరిసర ప్రాంతాల్లో దాదాపు 20,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించింది. పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేస్తున్న రాయబార ప్రయత్నాలు ఫలించాలంటే, అమెరికా దిగ్బంధనాన్ని సడలించాలని పట్టుబడుతోంది. ఈ పరిణామాలు గమనిస్తే, కాల్పుల విరమణ పొడిగించబడినప్పటికీ, దిగ్బంధనం కొనసాగినంత కాలం చర్చలు పట్టాలెక్కడం కష్టమనిపిస్తోంది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ 'మైండ్ గేమ్' అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హార్ముజ్ జలసంధిపై ట్రంప్ కీలక ప్రకటన

### ఒమన్ దేశాన్ని మిస్సైల్స్‌తో పేల్చేస్తామంటూ వార్నింగ్




మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సరికొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు అమెరికా సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన సైనిక చర్యల నేపథ్యంలో.. గత ఫిబ్రవరి నెలాఖరు నుండి ఇరాన్ ఈ కీలకమైన జలమార్గాన్ని దాదాపుగా మూసివేసింది. సాధారణంగా ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో ఐదో వంతు ఈ మార్గం గుండానే సాగుతుంది. దీని దిగ్బంధం వల్ల అంతర్జాతీయంగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తింది, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఏర్పడటంతో అన్ని దేశాల్లోనూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉత్కంఠభరిత వాతావరణంలో.. జలసంధి గుండా ప్రయాణించే ఓడలపై సంయుక్తంగా సుంకం (టారిఫ్) విధించేందుకు ఇరాన్ , ఒమన్ దేశాల మధ్య రహస్య చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. అమెరికాకు సుదీర్ఘకాలంగా మిత్రదేశంగా ఉన్న ఒమన్‌ను తమ వైపు తిప్పుకుని, ఈ సుంకాల వసూలు యంత్రాంగానికి మద్దతు ఇచ్చేలా ఒప్పించాలని టెహ్రాన్ ప్రయత్నిస్తోందని ఒక ప్రాంతీయ అధికారిని ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. ఈ పరిణామం వాషింగ్టన్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఒక క్యాబినెట్ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత నాటకీయమైన, కఠినమైన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ జలసంధి అనేది పూర్తిగా అంతర్జాతీయ జలాల్లో భాగమని, దానిపై ఎవరికీ ఏకపక్ష నియంత్రణ ఉండే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం నాటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ జలసంధి ప్రపంచ దేశాలన్నింటికీ అందుబాటులో ఉండబోతోందని, దీనిని ఎవరూ తమ ఆధీనంలోకి తీసుకోలేరని ప్రకటించారు. అమెరికా సైన్యం ఈ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుందని, ప్రస్తుత దౌత్యపరమైన చర్చలలో ఇది ఒక ముఖ్యమైన భాగమని ఆయన పేర్కొన్నారు అమెరికా ఆటలు సాగవిక.. ఇజ్రాయెల్‌ను భూమ్మీద లేకుండా నాశనం చేస్తాం.. దాడుల తర్వాత ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్.. అయితే, ఒమన్ దేశం ఇరాన్‌తో చేతులు కలపడంపై ట్రంప్ అసాధారణ రీతిలో స్పందించారు. ఒమన్ గనుక అంతర్జాతీయ నిబంధనల ప్రకారం మర్యాదగా ప్రవర్తించకపోతే, ఆ దేశాన్ని క్షిపణులతో పేల్చివేయడానికి కూడా వెనకాడబోమని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఒమన్‌కు తమ బలం ఏంటో తెలుసని, వారు లొంగి ఉంటే క్షేమంగానే ఉంటారని వ్యాఖ్యానించారు. ఇరాన్ ఈ జలసంధిని నియంత్రించాలని చూస్తోందని, కానీ అమెరికా దానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోదని ఆయన నొక్కి చెప్పారు. మరోవైపు, ఇరాన్‌తో ఒక శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇటీవలి వారాల్లో ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. బుధవారం నాటి సమావేశంలో ట్రంప్ నేరుగా ఇరాన్‌పై వ్యూహాత్మక ఆరోపణలు చేశారు. అమెరికాలో రాబోయే నవంబర్ మధ్యంతర ఎన్నికల వరకు ఎలాగైనా సమయాన్ని వృధా చేయాలని, ఒప్పందాన్ని ఆలస్యం చేస్తూ "నా కోసం వేచి చూడాలని" ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల ఫలితాలను బట్టి తమ తదుపరి అడుగులు వేయాలని టెహ్రాన్ భావిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, అమెరికా అంతర్గత రాజకీయాల్లోనూ ఈ యుద్ధ వ్యూహంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారాంతంలో ఇరాన్‌తో ఒక మైత్రి ఒప్పందం అంచున ఉన్నామని ట్రంప్ సంకేతాలు ఇవ్వడం రిపబ్లికన్ పార్టీలోని కఠిన నిర్ణయాలు కోరుకునే యుద్ధోన్మాద నాయకులకు నచ్చలేదు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి ఆదేశించాలన్న ట్రంప్ మునుపటి వివాదాస్పద నిర్ణయాన్ని గట్టిగా సమర్థించిన వారే, ఇప్పుడు ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా సెనేట్ సాయుధ సేవల కమిటీకి అధ్యక్షత వహిస్తున్న రోజర్ వికర్ సోషల్ మీడియా ద్వారా తన అసంతృప్తిని బహిర్గతం చేశారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదన ఒక పెద్ద విపత్తుగా మారుతుందని ఆయన హెచ్చరించారు. అమెరికా సైన్యం చేపట్టిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ద్వారా ఇప్పటివరకు సాధించిన సైనిక విజయాలన్నీ ఈ విరామం వల్ల బూడిదలో పోసిన పన్నీరవుతాయని, శత్రువుకు కోలుకునే అవకాశం ఇచ్చినట్లవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తమ్మీద, హ్ఖీుఖ్ శీట ఎశీతీఎబఓ చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయాలు అంతర్జాతీయంగా యుద్ధ మేఘాలను మరింత దట్టం చేస్తున్నాయి.



# అయిదుగురు హీరోయిన్లతో సినిమా?

గమ్యం, వేదం, కృష్ణంవందే జగద్గురుమ్, కంచె వంటి గొప్ప సినిమాలను తెరకెక్కించి అభిరుచి గల దర్శకుడిగా కితాబులందుకున్నారు దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. సందేశాత్మక కథలకు వాణిజ్యఅంశాలను జోడించి జనరంజక చిత్రాలను అందించడం క్రిష్ ప్రత్యేకత. అయితే.. గత కొన్నేళ్లుగా క్రిష్ కెరీర్ సరైన ట్రాక్‌లో లేదు. ఎన్టీయార్ కథానాయకుడు, మహానాయకుడు, కొండపొలం, ఘాటీ చిత్రాల ఫలితాలు ఆయన కెరీర్‌పై తీవ్రమైన ప్రభావాన్నే చూపాయి. అందుకే.. గత వైభవాన్ని దక్కించుకునేందుకు ఈ సారి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళు_న్నారట క్రిష్.

ఈ సారి కాస్టింగ్‌పై కాకుండా కథపైనే ఎక్కువ శ్రద్ధపెట్టి, ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌ని ప్రేక్షకులకు అందించే ప్రయత్నాల్లో ఆయన బిజీగా ఉన్నారట. అయిదుగురు అమ్మాయిల నేపథ్యంతో కూడిన ఓ కథను ఆయన ప్రస్తుతం తెరకెక్కిస్తున్నట్టు తెలిసింది. ఈ అయిదు ప్రధాన భూమికలకు అయిదుగురు యంగ్ హీరోయిన్లను ఎంపిక చేసినట్టు వినికిడి. ఇప్పటికే ఎలాంటి హడావిడి లేకుండా చిత్రీకరణ కూడా మొదలైంది. క్రిష్ గత చిత్రాల మాదిరిగానే ఆలోచింపజేసే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందట. ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# పెద్ది మేకర్స్ అలర్ట్.. ఆ ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు..!

రామ్ చరణ్ పెద్ది మేకర్స్ రిలీజ్‌కు ముందు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మూవీ పైరసీ, లీక్ విషయంలో మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించగా.. వీరికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలకు మార్గం సుగమమైంది. తాజాగా పెద్దిపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలకు దిగింది. ఈ సినిమాపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కావాలనే నెగెటివ్ ప్రచారం చేస్తున్నట్లు పెద్ది టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులకు మేకర్స్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సోషల్ మీడియా కార్యకలాపాలపై పెద్ది మూవీ టీమ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న పెద్ది మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.



# ఈ అభిమానం ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.



# విజయ్ దేవరకొండ బాలీవుడ్ చిత్రం?

పాన్ ఇండియా సినిమాల ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు అగ్రహీరో విజయ్ దేవరకొండ. తాజా సమాచారం ప్రకారం ఆయన తొలి హిందీ స్ట్రెయిట్ చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. వైవిధ్య చిత్రాల దర్శకుడు విక్రమ్ కె కుమార్ డైరెక్షన్‌లో విజయ్ దేవరకొండ ఓ చిత్రాన్ని చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. యూవీ క్రియేషన్స్ ఈ సినిమా నిర్మాణం చేపట్టనుందని ప్రచారం జరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ తెరకెక్కించనుందని సమాచారం. ఇటీవల ముంబయిలోని ఆ సినిమా ఆఫీసులో విజయ్ దేవరకొండ, విక్రమ్ కె కుమార్ ఇద్దరూ కనిపించడంతో ఈ వార్తలకు మరింతగా బలం చేకూరినట్లయింది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారని సమాచారం. అయితే ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రణబాలి' 'రౌడీ జనార్ధన' చిత్రాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే ఇవి ప్రేక్షకుల ముందుకురానున్నాయి.

# ఈ ప్రేమకథ 'రోమాంచకం'



అర్జున్ రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్‌ను అందించిన నిర్మాణ సంస్థ భద్రకాళీ పిక్చర్స్ తెరకెక్కిస్తున్న తాజా తెలుగు చిత్రానికి 'రోమాంచకం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ఆయన సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్ అండ్ పొయెటిక్ ఫీల్‌తో పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నవ్యత కలబోసిన ప్రేమకథా చిత్రమిదని, త్వరలో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, నరేంద్ర రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వాసుకి వైభవ్, సమర్పణ: సందీప్‌రెడ్డి వంగా, నిర్మాత: ప్రణయ్ రెడ్డి వంగా, రచన-దర్శకత్వం: వేణుగోపాల్ రెడ్డి.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com